ఆంధ్రజ్యోతి

సోమశిలలో 10.690 టీఎంసీల నిల్వ




అనంతసాగరం, మార్చి 25: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, సోమవారం నాటికి ప్రాజెక్టులో 10.690 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 350, డెల్టాకు 1,500, దక్షిణ కాలువకు 330 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు వారు తెలిపారు.


రంజాన్ వేళలు ఇఫ్తార్ (మంగళవారం) : 6.22 | సహరి (బుధవారం) : 4.50

ఉష్ణోగ్రతలు నెల్లూరు : 36.6 25.8 | కావలి : 34.0 23.0 | కందుకూరు : 34.0 26.0 | ఆత్మకూరు : 37.0 24.0 | ఉదయగిరి : 37.0 26.0



ఓటీఎస్ పథకం పేరుతో లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేసిన కాలనీ ఇళ్లు





ఓటీఎస్.. తుస్!

సంపూర్ణ గృహ హక్కు పథకం అవహాస్యం

- రెండేళ్ల క్రితం కేటగిరీల వారీగా నగదు వసూలు
- ఇప్పటికీ లబ్ధిదారులకు అందని హక్కు పత్రాలు

'దశాబ్దాలుగా ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద మంజూరైన ఇళ్లను క్రమబద్ధీకరిస్తాం. ఇందుకు నిర్ణీత ఫీజు చెల్లిస్తే చాలు. మీ పేరుమీదనే ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తాం. ఆ పత్రాలను బ్యాంకులో తనఖా పెట్టుకోవచ్చు కూడా.' అంటూ ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) పథకాన్ని తెరపైకి తెచ్చిన వైసీపీ ప్రభుత్వం జిల్లాలో అన్ని వర్గాల ప్రజల నుంచి రూ.కోట్లు వసూలు చేసింది. అయితే, లబ్ధిదారులు నగదు చెల్లించి రెండేళ్లు దాటినా చాలా మందికి గృహహక్కు పత్రాలు అందలేదు. మొన్నటిదాకా ఎన్నో ఆశలతో ఎదురుచూసిన లబ్ధిదారులు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆశలు వదులుకున్నారు.

సంగం, మార్చి 25 : జిల్లాలో జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) అవహాస్యమైంది. తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు హయాం నుంచి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వం (1983 నుంచి 2011) వరకూ గృహ నిర్మాణ పథకం కింద నిర్మించుకున్న లబ్ధిదారులకు వైసీపీ సర్కారు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ పథకం ద్వారా దశాబ్దాల కిందట నిర్మించిన ఇళ్లకు కొలతలు తీసి సంపూర్ణ గృహ హక్కు కల్పిస్తామని జగన్ సర్కారు నమ్మబలికింది. జిల్లాలో వేల మంది లబ్ధిదారుల నుంచి కోట్లాది రూపాయలు కట్టించుకుంది. ఇది జరిగి రెండున్నరేళ్లు గడుస్తున్నా హక్కు పత్రాలు ఇంతవరకూ చాలా మందికి అందలేదు.

● నాలుగు కేటగిరీలుగా..

1983 నుంచి 2011 వరకు గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులను జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకంలో నాలుగు కేటగిరీలుగా విభజించారు. కేటగిరీ ఏ కింద లబ్ధిదారుడు గృహనిర్మాణ సంస్థ నుంచి అప్పు తీసుకొని ఉండి మృతి చెందితే వారి వారసులకు పట్టా అందిస్తారు. గ్రామీణ ఆప్రంతాల్లో ఇల్లు ఉంటే రూ.10 వేలు, మున్సిపాలిటీలో రూ.15 వేలు, కార్పొరేషన్‌లో రూ.20 వేలు చొప్పున వసూలు చేశారు. కేటగిరీ బికి సంబంధించి రుణం తీసుకున్న వ్యక్తి నుంచి ఇతరులు ఆ ఇంటిని కొనుగోలు చేసినా క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశమిచ్చారు. ఇందుకుగాను గ్రామీణ ప్రాంతాల్లో రూ. 20 వేలు, మున్సిపాలిటీల్లో రూ.30వేలు, కార్పొరేషన్ పరిధిలో రూ.40 వేలు వసూలు చేపట్టారు. కేటగిరీ సీకి సంబంధించి ప్రభుత్వ రుణం పొందకుండా సొంతంగా ఇంటిని నిర్మించుకున్నవారి నుంచి రూ.10 వేలు చొప్పున వసూలు చేశారు. కేటగిరి డీ కింద ప్రభుత్వం పట్టా ఇచ్చిన తరువాత దానిని అమ్ముకుంటే కొనుగోలు చేసిన వారు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 10వేలు, మున్సిపాలిటీల్లో నూ 15వేలు, కార్పొరేషన్‌లో రూ. 20వేల వంతున వసూలు చేశారు.

● లబ్ధిదారుల లెక్క ఇలా..

జిల్లావ్యాప్తంగా అధికారులు, సచివాలయ సిబ్బంది బలవంతంగా వసూలు చేయడంతో ఇటు లబ్ధిదారుల నుంచే కాకుండా ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వెలువడ్డాయి. 1983 - 2011 మధ్య కాలంలో సుమారు రెండున్నర లక్షల ఇళ్లు నిర్మించినట్లు అప్పట్లో నిర్ధారించారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ. అయితే ఈ లబ్ధిదారులను గుర్తించడంలో అధికారులు చాలా ఇబ్బందులు పడ్డారు. సరైన అడ్రస్సులు లేకపోవడం, ఇళ్లు ఉన్నా లబ్ధిదారులు లేకపోవడం, కొన్ని ఇళ్లు శిథిలమైపోవడంతో రెండు లక్షలకుపైగా లబ్ధిదారులను గుర్తించారు. వీరి నుంచి సుమారు 90 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు. సుమారు రూ.10 కోట్లు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కానీ లబ్ధిదారుల నుంచి సహకారం లభించకపోవడం, మరోవైపు జిల్లాల విభజన పుణ్యమా అని ఈ అంశం మరుగున పడిపోయింది. దీంతో డబ్బులు కట్టిన వారికి ఎదురుచూపులు తప్పలేదు.

● బలవంతంగా వసూలు

ఓటీఎస్ విషయంలో ఒక్క లబ్ధిదారులే కాదు. అధికారులు, సచివాలయ సిబ్బంది అందరూ బాధ్యులే. అందరికీ టార్గెట్‌లు విధించడంతో వారు పేదల పింఛన్లు తొలగిస్తామని, సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని అప్పట్లో బెదిరించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ముడిపెట్టారు. డ్వాక్రా గ్రూపులో ఉన్నవారితో రుణాలు ఇప్పించి మరీ ఓటీఎస్ సెటిల్‌మెంట్ కట్టించుకున్నారు. వారికి ఇప్పటికీ డాక్యుమెంటు ఇవ్వలేదు. మరికొందరికి ఇచ్చినా అందులో వివరాలు తప్పుగా నమోదయ్యాయి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తీసుకున్నవారు రుణాలకు బ్యాంకుల వద్దకు వెళితే తిరస్కరిస్తున్నారు. దీంతో అధికారులిచ్చిన రిజిస్ట్రేషన్ పత్రాలు చిత్తుకాగితాలు మాదిరిగా బీరువాల్లో భద్రంగా పెట్టుకునేందుకు మాత్రమే పనికొస్తున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శనగ రైతుకు ఎన్నికల పోటు!

కందుకూరు, మార్చి 25: శనగ రైతుకు సార్వత్రిక ఎన్నికల పోటు తగిలింది. శనగ నూర్పిళ్ల సమయంలోనే ఆర్థిక సంవత్సరం ముగింపు రావడం, దానికితోడు దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో శనగలు కొనేందుకు వ్యాపారులు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు మధ్య దళారులు ధరలను తీవ్రంగా దిగజార్చటంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.



కందుకూరు ప్రాంతంలో శనగ కంపను మిల్లరుకు వేస్తున్న కూలీలు

● నెల రోజుల్లో రూ.4వేలు తగ్గుదల

నెల క్రితం వరకు క్వింటా రూ.12వేలు వరకు ధర పలికిన కాగ్-2 రకం (తెల్లశనగలు)ను ప్రస్తుతం రూ.8 వేలకు కూడా కొనుగోలు చేయకపోవడంతో శనగ సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా శనగ నూర్పిళ్ల సమయంలో ఏటా ధర పెరగడం పరిపాటి. ఈ ప్రాంతంలో శనగ నూర్పిళ్లు జరిగే సమయంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ మార్కెట్ల నుంచి శనగ ఎగుమతిదారులు, వారి ప్రతినిధులు ఈ ప్రాంతంలో తిష్టవేసి

దారుణంగా పతనమైన ధర

శనగలు కొనుగోలు చేసేవారు. దీంతో సాధారణ సమయం కన్నా నూర్పిళ్ల సమయంలో క్వింటాకు కనీసం నాలుగైదు వందలు ధర పెరగటం పరిపాటిగా ఉండేది. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా నూర్పిళ్ల సమయానికి క్వింటాకు రూ.4వేల వరకు ధర పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. శనగ కొనుగోళ్లు, అమ్మకాలకు కోట్లాది రూపాయల నగదు లావాదేవీలు అవసరం. శనగల కొనుగోళ్లు, తరలింపు ఎక్కువ శాతం అనధికారికంగా జరిగేది కావడంతో బ్యాంకు లావాదేవీలు కాకుండా నేరుగా నగదు చెల్లించి వ్యాపారులు తీసుకెళ్లేవారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా దూరప్రాంతాల నుంచి కోట్లాది రూపాయల నగదు తేవడం అసాధ్యం కావడంతో వ్యాపారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపటం లేదని సమాచారం. దీనికితోడు ఆర్థిక సంవత్సరం ముగింపు కావటంతో బ్యాంకులలో లావాదేవీలు కూడా క్లిష్టంగా మారి ఆ ప్రభావం శనగ కొనుగోళ్లపై తీవ్రంగా పడింది. దీంతో ఇదే అదనుగా స్థానిక వ్యాపారులు, మధ్య దళారీలు ధరను దారుణంగా దిగజార్చేశారు. దీంతో అడిగిన ధరకు తెగనమ్ముకోలేక శీతల గిడ్డంగులలో పెట్టనిదే నిల్వ ఉండే సరుకు కావటంతో రైతులు సతమతమవుతున్నారు. శీతల గిడ్డంగులలో బాడుగ, రవాణా ఖర్చులు భరించుకుని నిల్వచేయటం సన్న, చిన్నకారు రైతులకు తలకుమించిన భారం కావటంతో ఆందోళన చెందుతున్నారు.

● తగ్గిన దిగుబడులు

ఈ ఏడాది శనగ సాగుకు అదను దాటిపోయాక చేయటంతో దిగుబడులు కూడా భారీగా తగ్గిపోయాయి. ఎకరానికి తొమ్మిది, పది క్వింటాళ్ల సరాసరి దిగుబడి రావాల్సిన శనగలు ప్రస్తుతం నూర్పిళ్లలో ఐదారు క్వింటాళ్లకు మించి రావటం లేదు. దీనికితోడు క్వింటాల్‌కు 4వేలు ధర తగ్గటంతో రైతులు ఆశించిన రాబడిలో 50వేలకు పైగా కోతపడింది. ధర తగ్గటం వల్ల పాతికవేలు, సరాసరిన ఎకరానికి మూడు క్వింటాళ్ల దిగుబడి తగ్గటంతో మరో పాతికవేలు రైతు నష్టపోతున్న పరిస్థితి. ఆశించిన రాబడిలో ఎకరానికి యాభైవేలు కోతపడటంతో తీవ్రంగా నష్టపోక తప్పదని శనగరైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పెద్దరైతులు ఎన్నికలు పూర్తయితే ఆశించిన ధర వస్తుందని శీతల గిడ్డంగులలో నిల్వ చేస్తుండగా ఆ స్థోమత లేని సన్న, చిన్నకారురైతులు నష్టపోయేందుకు సిద్ధపడి దళారీలకు తెగనమ్ముకుంటున్నారు.



కేరింతల హోలీ

నెల్లూరు (సాంస్కృతికం): రంగుల పండుగ హోలీ సంబరాలను జిల్లావాసులు ఘనంగా జరుపుకున్నారు. నెల్లూరులో ఆదివారం అర్ధరాత్రి మార్వాడీలు, రాజస్తానీలు సంప్రదాయబద్ధం గా హోలీ దహన్ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం ఆబాలగోపాలం రంగులు చల్లుకుని హంగామా చేశారు. అనంతరం జైన్ మందిరాల్లో పూజలు చేసి స్వీట్లు పంచుకున్నారు. కాగా, వీఆర్ హైస్కూల్ మైదానంలో విద్యార్థులు, యువతీ యువకులు, పెద్దలు, చిన్నలు వేలాదిమంది హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. బాలభవన్ ఆధ్వర్యంలో మినీబైపాస్ రోడ్డు, వనంతోపు సెంటర్ నర్సరీలో హోలీ సంబరాలు చేసుకున్నారు.



మోహినీ అలంకరణలో రంగనాథుడు

గరుడారూఢా గోవింద!

- బంగారు గరుడ వాహనంపై శ్రీరంగనాథుడు

నెల్లూరు (సాంస్కృతికం): రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో సోమవారం గరుడోత్సవం భక్తులకు కనువిందు చేసింది. రంగనాథస్వామికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకారం, విశేష పూజలు జరిగాయి. ఉదయం స్వామివారు మోహినీ అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం బంగారు గరుడ వాహనంపై నగరోత్సవం వైభవంగా జరిగింది. కాగా, పాల్గుణ పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మీ జయంతిని ఘనంగా జరిపారు. మూలాపేట శంకరమఠం, పప్పులవీధి పాండురంగస్వామి ఆలయంలో చండీ హోమాలు జరిగాయి.

శ్రీవారికి వైభవంగా పుష్పయాగం

- వేదమంత్రాలతో మారుమోగిన బిలకూటక్షేత్రం

బిట్రగుంట, మార్చి 25: బోగోలు మండలం కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడికి వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, సహస్ర నామార్చన, నివేదన తదితర కార్యక్రమాలు అర్చకులు వీపూరి సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. స్వామి,అమ్మవార్లకు నరసింహాచార్యులు, కళ్యాణాచార్యులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పరిమళభరిత పుష్పాలతో వేదమంత్రాల మధ్య పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిలకూటక్షేత్రం శ్రీవారి నామస్మరణతో మారుమోగింది. రాత్రికి శ్రీనివాసుడికి ఏకాంతసేవను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమ్మవారిపాలెంకు చెందిన కరియావుల అప్పలనాయుడు-శ్రీలత, రమేష్-లక్ష్మీలావణ్య, కావలికి చెందిన గాదంశెట్టి వేణుగోపాల్ - అనంతలక్ష్మి, అమరా వేదిగిరి సుబ్బరాయుడు గుప్తా- విజయలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సరిపెడతారా..

ఎక్కడికక్కడ క్వార్ట్జ్ అక్రమార్కులు గప్‌చుప్!

సంగతేంటో తేలుస్తారా!?

- ప్రభుత్వ భూములు కుళ్లబొడిచి రూ.కోట్లు స్వాహా
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుతో కదలిక
- పొదలకూరు, సైదాపురంలో అక్రమాల గుర్తింపు
- కేసులు పెట్టినా కనిపించని పురోగతి
- తమకేమీ పట్టదన్నట్లుగా రెవెన్యూ యంత్రాంగం

క్వార్ట్జ్ అక్రమాలపై రెండురోజులు హడావిడి చేసిన అధికారులు, పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తారా!? లేదా అంతటితో సరిపెడతారా!? అన్నది చర్చనీయాంశంగా మారింది. మూడు నెలలుగా ఈ అక్రమ తవ్వకాలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అధికారులు స్పందించలేదు. అయితే, ఎన్నికల కోడ్ తర్వాత టీడీపీ నేతలు కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు స్పందించారు. పొదలకూరు, సైదాపురం మండలాల్లో దాడులు నిర్వహించి తవ్వకాల్లో అక్రమాలను గుర్తించారు. భారీగా క్వార్ట్జ్ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కేసులు కూడా పెట్టారు. అయితే, ఇప్పటివరకు తరలిపోయిన రూ.వందల కోట్ల ప్రజాధనానికి బాధ్యులెవరు? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

నెల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గత వారం పొదలకూరు మండలంలోని మొగళ్లూరు, మరుపూరు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసిన ప్రాంతాల్లో మైనింగ్ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా భారీగా క్వార్ట్జ్ నిల్వలను సీజ్ చేశారు. మొగళ్లూరులోని సర్వే నెం.286లో 13,677 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను తవ్వేసినట్లు గుర్తించారు. అప్పటికే అక్రమార్కులు తరలించగా మిగిలిన 4,001 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరుపూరులోని సర్వే నెం.583, 584, 585లలో 4020 మెట్రిక్ టన్నుల తవ్వకాలు జరిపినట్లు నిర్ధారించారు. ఆ ప్రాంతంలో విక్రయాలకు సిద్ధంగా ఉంచిన 2,990 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను సీజ్ చేశారు. ఈ విషయమై మైనింగ్ అధికారులు పొదలకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైనింగ్ చట్ట ప్రకారం పోలీసులు కేసులు కట్టారు. అయితే ఇవన్నీ ప్రభుత్వ భూములే. మరి ప్రభుత్వ భూముల్లో ఇంత బహిరంగంగా తవ్వకాలు జరిపి, ప్రజా ధనాన్ని దోచుకెళుతుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రతి గ్రామంలో సచివాలయం ఉంది. అక్కడ ఓ వీఆర్వో ఉన్నారు. వారికి ఆ గ్రామంలో ఏం జరుగుతుందో తెలిసిపోతుంది. కానీ వారు ఎవరూ కూడా అక్రమ మైనింగ్‌ను అడ్డుకోలేదు. పోనీ మైనింగ్ అధికారులు ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు జరిగాయని నిర్ధారించిన తర్వాత కూడా రెవెన్యూ శాఖ స్పందించలేదు. తమ భూముల్లో రూ.వందల కోట్ల విలువైన క్వార్ట్జ్‌ను తవ్వేస్తే కనీసం వారు కేసులు కూడా పెట్టలేదు. ఇక మైనింగ్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసులు కట్టిన పోలీసులు వారం గడిచినా ఇంతవరకు ఏ ఒక్కరినీ అరెస్టు చేయలేదు. ఫిర్యాదుల్లోనే కొంతమంది పేర్లను అధికారులు పేర్కొన్నారు. తవ్వకాలు జరిపిన ప్రాంతాల్లో నుంచి వాహనాలు వెళ్లిన మార్గాల్లో సీసీ కెమెరాలు పరిశీలిస్తే ఏయే వాహనాలు క్వార్ట్జ్ లోడ్‌లతో వెళ్లాయో తెలిసిపోతుంది. మరి ఆ దిశగా విచారణ సాగుతున్నట్లు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పొదలకూరు మండలం మరుపూరులో అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు (ఫైల్)

● కేంద్రం ఆదేశాలతో కదలిక

పొదలకూరు మండలం వరదాపురం సమీపంలోని రుస్తుం, భారత్ మైన్లలో తవ్వకాలపై హైకోర్టు స్టే ఇచ్చినా లెక్కచేయకుండా క్వార్ట్జ్‌ను అక్రమంగా తరలించారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తినా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు స్పందించలేదు. దీంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీలకు టీడీపీ నేత సోమిరెడ్డి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. స్పందించిన కేంద్ర గనుల శాఖ.. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో జరుగుతున్న క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌పై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఫలితంగా కదిలిన రాష్ట్ర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి నివేదిక ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వివిధ శాఖల అధికారులు క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై నివేదికలు తయారు చేస్తున్నట్లు సమాచారం. జీపీఎస్ ఫొటోలు, జీపీఎస్ వీడియోలను జత చేస్తూ సోమిరెడ్డి ఫిర్యాదు చేయడంతో అధికారులు ఇరుక్కుపోయారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు నిజమేనని నివేదిక ఇస్తే నాడు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నిస్తారని, ఒకవేళ అక్రమ తవ్వకాలు జరగలేదని తప్పుడు నివేదిక ఇస్తే అది కూడా తమ మెడకే చుట్టుకుంటుందని అధికార వర్గాలు వాపోతున్నాయి.

తనిఖీలు కొనసాగిస్తాం..

క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై దృష్టి పెట్టాం. ఇప్పటికే పలు చోట్ల తవ్వకాలను గుర్తించి సరుకును సీజ్ చేశాం. పోలీసు కేసులు కూడా నమోదు చేశాం. ఇంకొందరికి నోటీసులు ఇచ్చి జరిమానాలు వసూలు చేస్తున్నాం. అక్రమ తవ్వకాలపై తనిఖీలు కొనసాగిస్తాం.

\- శ్రీనివాసకుమార్, మైనింగ్ డీడీ

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


రోడ్డుపై పడి ఉన్న సురేష్ మృతదేహం

మర్రిపాడు, మార్చి 25: చుంచులూరు సమీపంలోని జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ యవకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసున్నారు. మృతుడు కడప జిల్లా ఖాజీపేటకు చెందిన సురేష్ (29)గా గుర్తించారు. ఇతను కూలి పనిమీద వలస వెళ్లి తిరిగి రోడ్డు మార్గాన నడుచుకుంటూ తమ ఊరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


సురేష్‌రెడ్డి మృతదేహం

కావలి రూరల్, మార్చి 25: అప్పులబాధ తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగన సురేష్‌రెడ్డి(32) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి రమణారెడ్డి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండవ పట్టణ పోలీసుల కథనం మేరకు.. జలదంకి మండలం గోపన్నపాలెంకు చెందిన సురేష్‌రెడ్డి బ్యాంకులో రుణం తీసుకుని సెంట్రింగ్ సామగ్రి కొనుగోలు చేసి అద్దెకు ఇస్తూ కావలి పట్టణం వెంగళరావునగర్‌లో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సురేష్‌రెడ్డి వ్యాపారం చెయ్యలేక పోవడంతో అతని తండ్రి బ్యాంకుకు ఈఎంఐ చెల్లిస్తున్నాడు. దీంతో మనస్థాపం చెందిన అతను ఈనెల 4వ తేదీన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తన సోదరుడు సుధాకర్ రెడ్డికి ఫోన్ చేసి చెప్పాడంతో కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 24వ తేదీన నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మీనాక్షి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కందుకూరులో మహిళ దారుణహత్య

● భర్తే కొట్టి చంపేశాడని అనుమానం ● పరారీలో నిందితుడు


వనజాక్షి మృతదేహం, వనజాక్షి (ఫైల్)

కందుకూరు, మార్చి 25: పట్టణంలో ఓ మహిళ సోమవారం మధ్యాహ్నం దారుణహత్యకు గురైంది. కందుకూరులోని పామూరురోడ్డు సర్కిల్ సమీపంలో గాయత్రీనగర్‌లో బ్యూటీపార్లర్ నడుపుతున్న చిమటా వనజాక్షి (27) హత్యకు గురైంది. వనజాక్షి శరీరమంతా గాయాలతో రక్తపుమడుగులో విగతజీవిగా పడిఉండగా సోమవారం సాయంత్రం గుర్తించిన చుట్టుపక్కలవారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వనజాక్షి భర్త శివకృష్ణ ఫోన్ స్విచ్ఛాప్ చేసి పరారీలో ఉండటంతో భర్తే ఆమెను హతమార్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. వనజాక్షి తలకు, చేతికి బలమైన గాయాలు ఉండటం, తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందటంతో రోకలిబండతో బలంగా కొట్టినట్లు భావిస్తున్నారు. ఇంటిప్రధాన ద్వారం వద్దే ఆమె కుప్పకూలిపోయి మృతిచెందగా తలుపు కూడా వేయకుండా హంతకుడు పరారయ్యాడు. మృతురాలు వనజాక్షిది శ్రీకాకుళం సమీపంలోని కోటబొమ్మాళి కాగా, పన్నెండేళ్లక్రితం శివకృష్ణతో వివాహమైంది. వారికి ఇద్దరు అమ్మాయిలు. కాగా కొన్నేళ్లుగా పావని బ్యూటీపార్లర్ పేరుతో ఇంటివద్దే బ్యూటీపార్లర్ నడుపుతున్న వనజాక్షిని భర్తే హతమార్చాడన్న వార్త పట్టణంలో సంచలనం రేపింది. పట్టణ సీఐ హఫీజ్ మృతదేహాన్ని సందర్శించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), మార్చి 25: ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, ఎలాంటి అనుమతులు లేకుండా విరాట్‌నగర్‌లో 'కొణిదల విజయం.. కొట్టే లక్ష్యం' అనే నినాదాలతో, పవన్‌కళ్యాణ్ ఫొటో, స్టిక్కర్లు అతికించి ఉన్న ప్రచార వాహనాన్ని ఫ్లైయింగ్‌స్క్వాడ్ అధికారులు సోమవారం గుర్తించారు. డ్రైవర్‌ను ప్రశ్నించగా ఎలాంటి అనుమతి పత్రాలు లేవని చెప్పాడు. దీంతో ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని చిన్నబజారు పోలీసులకు అప్పగించారు. ఫ్లైయింగ్‌స్క్వాడ్ అధికారి దామోదరరావు ఫిర్యాదు మేరకు ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఎస్ఐ లతీఫున్నీసా కేసు నమోదు చేశారు.

టిప్పరు ఢీకొని రైతు కూలీ మృతి


నరసింహులు మృతదేహం

అనంతసాగరం, మార్చి 25: మండల కేంద్రమైన అనంతసాగరం బద్వేల్ రోడ్డులోని డాబా వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొమరిగిరి నరసింహులు (46) మృతి చెందాడు. కొత్తపల్లి ఎస్టీ కాలనీకి చెందిన నరసింహులు అనంతసాగరంలో ఒక రైతు వద్ద కూలీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తన ఎక్స్‌ఎల్ వాహనంపై పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా టిప్పర్ ఢీకొన్నట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన నరసింహులును 108 వాహనంలో ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు తరలించగా మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాహం తీరే దారేది ?

● మండుతున్న ఎండలు ● కనిపించని చలివేంద్రాలు


వరికుంటపాడులో దాతలు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం (ఫైల్)

ఉదయగిరి రూరల్, మార్చి 25: ఈ ఏడాది మార్చి ప్రారంభం నుంచే ఎండలు మండుతున్నాయి. రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పల్లెలు, పట్టణాల్లో దాహం కేకలు వినిపించకుండా చర్యలు చేపట్టాల్సిన అనవరముంది. ఎక్కడికక్కడ చలివేం ద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా, అధికారులు నేటికీ ఏర్పాటు చేయలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కాస్త ఎండలు ముదరగానే ప్రభుత్వం శరగవేగంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయిం చేది. మరికొన్ని కొన్ని చోట్ల దాతలు సహకారంతో చల్లటి మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం చలివేంద్రాల ఏర్పాటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముంది. ఇప్పటికే మెట్ట ప్రాంతమైన ఉద యగిరిలో ఎండలు మండుతున్నాయి. పల్లెల నుంచి మండల కేంద్రాలకు వచ్చే ప్రజలు, పాదచా రులు, ఇతరత్రా వాహనదారులు ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలు లేకపోవడంతో గొంతు తడు పుకొనేందుకు గుక్కెడు నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో నగదు చెల్లించి మంచినీళ్ల కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

● దాతలే దిక్కు

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు మొక్కుబడిగానే ఉంది. ప్రధాన సెంటర్లలో దాతలు, దుకాణదారులు ఏ ర్పాటు చేసిన చలివేంద్రాల వద్దనే పాదచారులు, వాహ నదారులు దాహార్తి తీర్చుకొంటున్నారు. గతంలో ప్రభు త్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు పంచాయతీ కార్యదర్శులు ఖర్చు చేస్తే నిర్వహణ నిధులు మం జూరు చేసేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రజల దాహార్తిని తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదు

● అర్ధరాత్రి స్పందించిన అధికారులు ● షామియానా తొలగింపు

కలిగిరి, మార్చి 25: కలిగిరి పట్టణంలో వైసీపీ పార్టీ కార్యాలయం ప్రారంభం కోసం ఏర్పాటు చేస్తున్న షామియానా వైసీపీ పార్టీ రంగులు కలిగి ఉండటంతో సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు సోమవారం రాత్రి 11గంటల సమయంలో ఫిర్యాదు అందింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి సతీష్, ఎస్ఐ సంతోష్‌కుమార్‌రెడ్డిలు ఆర్‌వో ఆదేశాల మేరకు ఫిర్యాదు అందిన గంట సమయంలో షామియాను తొలగించారు.


షామియానాను తొలగిస్తున్న ఎన్నికల సిబ్బంది

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	135
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	266
లేయర్	125

బంగారం, వెండి ధరలు


బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6335
వెండి కిలో ధర	రూ. 76,300
వెండి ఒక గ్రాము	రూ. 78.30

హద్దులు చెరిపేసి.. ఇసుక దోచేసి..!

● భారీ గుంతలతో ఇంకిన భూగర్భజలాలు
● అవాక్కైన తనిఖీ అధికారులు

అనంతసాగరం, మార్చి 25: సోమశిల జలాశయానికి అతిసమీపంలోని పడమటి కంభంపాడు(పీకే పాడు) ఇసుక రీచ్‌లో నిబంధనలు ఉల్లంఘించి భారీ యంత్రాలతో ఇసుక తోడేశారు. ఆ ఆనవాళ్లు చూసి అధికారులు అవాక్కయ్యారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జేపీ, ప్రతిమ సంస్థల పేర్లతో నామమాత్రపు అనుమతులు పొంది ఎక్స్‌కవేటర్లతో భారీగా గుంతలు తవ్వి ఇసుక అమ్మకాలకు తెరలేపారు. ఈ


ఇసుక తవ్వకాలతో బయటపడ్డ భూగర్భ జలాలు

రీచ్‌లో అవినీతి తారస్థాయిలో జరిగినప్పటికి మొన్నటి వరకు అధికారులు ఈరీచ్ వైపు కన్నెత్తి చూడలేదు. పర్యావరణానికి ముప్పుతెచ్చేలా రీచ్‌లో ఇసుక తవ్వకాలు జరిగాయి. ఆపాలంటూ కొందరు కోర్టును ఆశ్రయించగా హైకోర్టు ఆదేశాలతో జిల్లాలోని అన్ని రీచ్‌ల్లో ఇసుక దోపిడీకి అడ్డుకట్ట పడింది.

● నివ్వెరపోయిన అధికారులు

ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పీకేపాడు రీచ్‌ను జిల్లా మైనింగ్ అధికారి, రెవెన్యూ అధికారులు సందర్శించి అక్కడ జరిగిన తవ్వకాల ఆనవాళ్లు చూసి నివ్వెరపోయారు. హద్దులు చెరపేసి.. ఇసుక దోపిడీ చేసిన తీరుపై అవాక్కయ్యారు. ఈ రీచ్‌లో తవ్వకాలు జరుపుతూ అటు కలువాయి మండలం రాజుపాలెం వరకు, ఉత్తరాన ఉప్పలపాడు వరకు సుమరు 5నుంచి 8 కిలోమీటర్ల వరకు ఇసుక తోడేసిన పరిస్థితి కనిపించింది. గోరంత అనుమతితో కొండంత దోపిడీ జరిగిన తీరు కళ్లకు కట్టినట్లు ఉండగా, ఇక జరిగిన అవినీతిపై పరిశీలన చేసిన తనిఖీ బృందం ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. పీకేపాడు రీచ్‌లో ఇసుక అమ్మకాల పేరిట నిబంధనలు ఉల్లంఘించి 5 నుంచి 10 అడుగుల మేరకు తవ్వకాలు జరిగాయి. ఈక్రమంలో భూగర్భ జలాలు బయటపడ్డాయి. దీంతో ప్రాజెక్టు సమీపంలోని పొలాల్లో ఉన్నా బోర్లకు నీరు తగ్గిపోయే పరిస్థితి తలెత్తినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పలపాడు, కమ్మవారిపల్లి, పీకేపాడు, గోవిందమ్మపల్లి గ్రామాల్లో బోర్లలో నీరు ఇంకిపోయే ప్రమాదం నెలకొందని పలువురు వాపోతున్నారు. ఈ రీచ్‌లో జరిగిన అక్రమ తవ్వకాలు గురించి పలుమార్లు ఉన్నతాధికారులకు పిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.


ఇసుక తవ్వేసి రీచ్‌లోకి ఏర్పాటు చేసిన బాట

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు : కలెక్టర్


బీఎల్వోలను అడిగి ఓటర్ల జాబితాపై వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ హరినారాయణన్

కావలి, మార్చి25: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ తెలిపారు. సోమవారం కావలి పాతూరు మున్సిపల్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను కావలి ఆర్వో శీనానాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఎలాంటి అసౌకర్యం లేకుండా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పక్కాగా ఏర్పాట్లను చేపడుతున్నట్లు చెప్పారు.ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ఓటరు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వేసవి దృష్ట్యా టెంట్లు, మంచినీటి వసతి సమకూర్చుతున్నామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, దివ్యాంగులకు అనువుగా ర్యాంపుల ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం బీఎల్వోల వద్ద ఓటర్ల జాబితాను పరిశీలించి దివ్యాంగులు, వృద్ధుల ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

● కంట్రోల్ రూమ్ పరిశీలన

అనంతరం కలెక్టర్ కావలి ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. సీ విజల్,1950 కాల్ సెంటర్లకు వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీశారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎస్ఎస్‌టీ బృందాలు పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్, డీఈ సాయిరామ్, సెక్టోరల్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

రేపు కామర్స్, బోటనీ, జువాలజీ మూల్యాంకనం

నెల్లూరు (విద్య), మార్చి 25 : ఇంటర్మీడియట్ కామర్స్, బోటనీ, జువాలజీ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఎ.శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సంబంధిత లెక్చరర్లకు తెలియచేసి వారిని సంసిద్ధులను చేయాలన్నారు. నెల్లూరు నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశా లలో ఏర్పాటు చేసిన స్పాట్ కేంద్రంలో 27వతేదీ ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని ఆయన ఆదేశించారు. విధుల్లో ఎవరికీ మినహాయింపు ఉండదని, కచ్చితంగా హాజరు కావాలని తెలిపారు.

దేన్నీ వదలని.. ప్రచారం పిచ్చి !

● విద్యార్థులకు ఇచ్చిన ప్రతి వస్తువుపైనా జగన్ చిత్రాలు, వైసీపీ రంగులు
● పట్టించుకోని అధికారులు



పొదలకూరు, మార్చి 25 : పాఠ్యపుస్తకం, బ్యాగు, బెల్టు, చివరకు పోషకాహార ప్యాకెట్లు... కాదేదీ ప్రచారానికి అనర్హం... అన్నట్లుగా సీఎం జగన్ వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తులో ప్రచారానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతోనే జగనన్న విద్యాకానుక పేరుతో విద్యార్థులకు ఇచ్చిన ప్రతి వస్తువుపైనా ఆయన చిత్రాలు, వైసీపీ గుర్తు, రంగులను ముద్రించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి వారం కావస్తున్నా.. అధికారులు వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అధికార పార్టీకి విద్యార్థులు ప్రచార సాధనాలుగా మారారు. నిఘంటువులపై నవరత్నాల స్టిక్కర్లున్నాయి. ట్యాబ్‌లు ఆన్‌చేయగానే జగన్ చిత్రంతో కూడిన సమాచారం వస్తోంది. ఎన్నికల నియమావళికి దొరక్కుండా పిల్లల ద్వారా జగన్‌కు మంచి ప్రచారం వస్తోందని, కావున ఎన్నికల సంఘం తక్షణం స్పందించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. వైసీపీ ప్రచార దాహానికి అధికార యంత్రాంగం అడ్డుకట్ట వేయడంలేదు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో చాలా పథకాలకు, వెబ్‌సైట్‌లోనూ ప్రచారాలు యథావిధిగా వస్తున్నాయి. 8వతరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌ల్లోనూ సీఎం జగన్ నవరత్నాల పేరుతో యాడ్‌ను నిక్షిప్తం చేశారు. విద్యార్థులు ఆన్ చేసిన వెంటనే ఇప్పటికీ నవరత్నాల పేరిట సీఎం జగన్ చిత్రం అందులో కనిపిస్తోంది. ఇవేమీ ఎన్నికల కోడ్‌కి ఆటంకం కాదన్నట్లుగా అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వ ప్రోత్సాహం లేక పశుపోషణ భారం

● అటకెక్కిన పథకాలు ● పశు పోషకుల అవస్థలు


కొడవలూరులోని పశువైద్యశాల

కొడవలూరు మార్చి 25: ప్రభుత్వ ప్రోత్సాహం లేక పశుపోషణ భారంగా మారిందని పశు పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పాల ఉత్పత్తి పెంపునకు ఏటా పశు పోషకులకు మాగుడు గడ్డి, దాణా పలురకాల పశుగ్రాస విత్తనాలు రాయితీపై అందించేవారు. ఊరురా పశుగ్రాస క్షేత్రాలు పేరిట పశుగ్రాసం విస్తారంగా సాగుచేయించారు. రాయి తీపై విత్తనాలు, నారు అందచేశారు. విత్తనాలు కొనుగోలుకు, వ్యవ సాయానికి కూలీలకు ఇతర సాగు ఖర్చులకు నగదు చెల్లించేవారు. రెండేళ్ల పాటు ఈ పథకంలో రైతులు పశుగ్రాసం పెంచుకునేవారు. వేసవిలో పశుగ్రాసం కొరత ఉన్న అన్ని ప్రాంతాలకు రాయితీపై పచ్చగడ్డి సరఫరా చేసేవారు. కాగా, వైసీపీ ప్రభుత్వం వచ్చాక వీటిని నిలిపివేసింది. రాయితీ పథకాలు అమలుకాక, అందుబాటులో ఉన్న పథకాలకు నిదులు విడుదల కాక పశుపోషణ కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. మండలంలో రేగడి చెలిక, కొత్తవంగల్లు, రాచర్లపాడు ప్రాంతంలో పశుగ్రాసం కొరతతో పాడిరైతులు ఇబ్బందులు పడుతున్నారు. వంద వరి గడ్డికట్టలు రూ. 10వేలు పలుకుతోందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధే మా అజెండా!

● మాటలు చెప్పే వాళ్లం కాదు.. చేతల్లో చూపిస్తాం !
● విడవలూరు ప్రచారంలో టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి దంపతులు


వీపీఆర్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

విడవలూరు, మార్చి 25 : 'అభివృద్ధే మా అజెండా.. మాటలు చెప్పేవాళ్లం కాదు.. అభివృద్ధి అంటే చేతల్లో చూపిస్తామని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. విడవలూరులో వేమిరెడ్డి దంపతులు సోమవారం ప్రచారం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తల జయ జయధ్వానాల నడుమ స్థానిక సినిమాహాలు సెంటర్ ఉంచి అంకమ్మ దేవాలయం సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అంకమ్మ ఆలయంలో వేమిరెడ్డి దంపతులు పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో జిల్లా ప్రజలకు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని తెలిపారు. అనంతరం ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అవినీతి రహిత, వివాద రహిత పాలన సాగిస్తానని అన్నారు. టీడీపీ నేతలు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, జనసేన మండల కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. రామతీర్థంలో వేమిరెడ్డి దంపతులకు మత్స్యకారులు ఘన స్వాగతం పలికారు.

● టీడీపీలో చేరికలు

మండలానికి చెందిన వైసీపీ నాయకులు వేమిరెడ్డి దంపతుల సమక్షంలో టీడీపీలో చేరారు. ఈస్ట్రన్ చానల్ మాజీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, వైసీపీ మాజీ కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, ఊటుకూరులో కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభానురెడ్డి, వైసీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, సర్పంచు శేషమ్మ, ముదివర్తిలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్కే. రఫీ తదితరులు భారీ ఎత్తున టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల శ్రీనివాసులు, సత్యవోలు సత్యంరెడ్డి, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, చలంచర్ల కామేశ్వరమ్మ, కొమ్మి శ్రీధర్‌నాయుడు. భవానమ్మ, తాటిపర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● సేవ చేసేందుకే రాజకీయాల్లోకి..

కోవూరు (విడవలూరు): ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చామని వేమిరెడ్డి దంపతులు తెలిపారు. సోమవారం కోవూరు పంచాయతీలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ తన భర్త మరణించిన తర్వాత కుటుంబసభ్యుల అనుమతితో తాను రెండో వివాహం చేసుకున్నానని, దీనిని వైసీపీ నాయకులు రాజకీయం చేయడం బాధాకరమన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నాయకులు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కృష్ణచైతన్య బీజేపీ నాయకులు వాకాటి నారాయణరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరుల తోపాటు పలువురు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జనసంద్రంగా మారిన విడవలూరు

524 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మార్చి 25: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 587 పొ గాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీ ప్రతినిధులు పాల్గొని 524 బేళ్ల కొనుగోలు చేశారు. నోసేల్-3, నోబిడ్-34, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-14 తదితర కారణాలతో 63 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.230, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.228.02గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.


మత్స్యకార గ్రామాల్లో భద్రతా బలగాల కవాతు



తోటపల్లిగూడూరు, మార్చి 25: కోడూరు మత్స్యకార గ్రామాల్లో కృష్ణపట్నం సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర భద్రతా బలగాలు సోమవారం కవాతు నిర్వహించాయి. అనంతరం సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలి పారు. సమస్యాత్మక గ్రామాలలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేస్తామని, ప్రజ లందరూ తమకు సహకరించాలని కోరారు. వారి వెంట ఎస్ఐ జంపానీకుమార్ తదితరులు ఉన్నారు.

జగనన్నా.. పశు నష్టపరిహారం ఏది ?

● ప్రభుత్వం విడుదల చేయాల్సింది రూ.8.6 కోట్లు ● రెండేళ్లుగా పాడిరైతుల ఎదురుచూపులు



నెల్లూరు(వ్యవసాయం), మార్చి 25: జిల్లాలో వ్యవసాయం తరువాత పశుపోషణపై ఎక్కువమంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుకి చెందిన పశువు చనిపోతే, ఆ విషయాన్ని స్థానిక పశువైద్యాధికారి ధ్రువీకరిస్తే ప్ర భుత్వం నుంచి పరిహారం అందేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్ఆర్ పశునష్టపరిహార పథకాన్ని కొత్తగా తీసుకువచ్చింది.ఈ పథకం ప్రారంభంలో పాడిరైతులకు నష్టపరిహారం కాస్త ఆలస్యంగానైనా అందేది. అయితే గత రెండేళ్ల క్రితం నుంచి పశు నష్టపరిహారం రైతులకు అందడంలేదు.దీంతో పాడిరైతులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● బీమా పథకంలో మార్పులు

జిల్లాలో 5,774 ఆవులు, 6,46,106 గేదెలు, 3,86,929 మేకలు, 10,95,197 గొర్రెలు ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ అధికారుల అంచనా. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బీమా పరిహారంలో పలుమార్పులు తీసుకువచ్చింది. వైఎస్ఆర్ పశునష్టపరిహార పథకం ద్వారా పశువులకు ఉచిత బీమా అందుతుంది. పశువు చనిపోతే వెంటనే రైతు టోల్ ఫ్రీ నంబరు 58500001962కు కాల్ చేసి సమాచారం అందించాలి. అలాగే స్థానిక పశువైద్యుడికి సమాచార మిస్తే ఆయన వచ్చి ప్రాథమిక సమాచారం సేకరిస్తారు. ఆతరువాత పశువుకు సంబంధించిన వయసు నిర్ధారించి, పరిహారం ఎంత అనేది నిర్ణయిస్తారు. ఈ క్రమంలో దాదాపు రెండేళ్ల క్రితం నుంచి చనిపోయిన పశువులు, మేకలు, గొర్రెలకు నష్టపరిహారం అందలేదు. ప్రస్తుతం ఈ పథకాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేసింది. రద్దయ్యే సమయానికి జిల్లాలో 3249 తెల్ల, నల్లపశువులకు రూ.8,24,88,000ల పరిహారం రావాల్సి ఉంది. అలాగే 619 మేకలు, గొర్రెలకు రూ.39,93,000లక లిపి మొత్తం రూ.8,64,81,000ల పరిహారం అందాల్సి ఉంది. రెండేళ్లుగా పాడి రైతులు ఈ పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. పశుసంవర్ధకశాక అధికారులు పరిహారానికి సంబంధించిన అన్ని పత్రాలను ప్రభుత్వానికి పంపించారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాల్సి ఉందని వారు చెబుతున్నారు. సకాలంలో బీమా పరిహారం అందక రైతులు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

నిర్వహణకు నోచుకోని బస్‌షెల్టర్లు!

- పరిశుభ్రతకు నోచుకోక లక్షలు వెచ్చించిన నిర్మాణాలు వృథా
- చెట్ల కింద సేదతీరుతున్న ప్రయాణికులు



తాతిరెడ్డిపాలెంకు వెళ్లే దారిలోని బస్‌షెల్టర్



చెట్టు నీడన సేద తీరుతున్న ప్రయాణికులు

ఆత్మకూరు, మార్చి 25: నియోజకవర్గంలోని అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, మర్రిపాడు, ఆత్మకూరు, సంగం మండలాల్లోని గ్రామాల్లో నిర్మించిన బస్‌షెల్టర్లు నిర్వహణకు నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్లను పట్టించుకునే వారే కరువయ్యారు. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన నిర్మాణాలు వృథాగా మారుతున్నాయి. ఈ సమస్యతో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు నిలువనీడ లేక చెట్ల కింద వేచిచూడాల్సిన పరిస్థితి నెలకుంది. ఆత్మకూరు మండలంలోని నువ్వూరుపాడు, అశ్వినీపురం, జంగాలపల్లి, దేపూరు గ్రామాల్లో రోడ్డు పక్కనే నిర్మించిన బస్‌షెల్టర్లు నిర్వహణ కొరవడి ప్రయాణికులు కూర్చునేందుకు అనువుగా లేక అధ్వానంగా ఉన్నాయి. ఏఎస్‌పేట మండలంలో తాతిరెడ్డిపాళెం, పొనుగోడు, చౌటభీమవరం గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి నుంచి ప్రయాణికులకు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంతదూరం నుంచి రాకపోకలు సాగించిన ప్రయాణికులు సేదతీరేందుకు ఉన్న బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారడంతో చెట్లు నీడన సేద తీరుతున్నారు. అనంతసాగరం, చేజర్ల మండలాల్లో పరిస్థితి అలాగే ఉన్నది.

పట్టించుకోని అధికారులు

వీటి నిర్వహణను ఆర్టీసీ, గ్రామ పంచాయతీ అధికారులు గాలికి వదిలేశారు. శుభ్రం చేసేవారు లేకపోవడంతో చెత్తాచెదారంతో నిండి పరిసరాలు దుర్వాసన వెదజల్లుతుంటాయి. ప్రయాణికులు బస్‌షెల్టర్ ప్రాంగణంలో నిలుచోలేకపోతున్నారు. ఎక్కడా మూత్రశాలలు లేవు. కనీసం తాగునీటి సౌకర్యం, విద్యుత్‌దీపాలు లేవు. రాత్రియ్యిందంటే బస్‌షెల్టర్ల పరిసరాల్లో అంధకారం అలుముకుంటోంది. ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యమని చెప్పే ఆర్టీసీ అధికారులు, గ్రామాల అభివృద్ధికి కృషి చేసే పంచాయతీ అధికారులు బస్‌షెల్టర్ల అభివృద్ధిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

హోలీ.. రంగోళీ !



సంగం: రంగులు పూసుకుని నీళ్లు చల్లుకుంటున్న చిన్నారులు



సీతారామపురం, మార్చి 25: సీతారామపురంలో చిన్నపెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

ఉదయగిరి: గడ్డంవారిపల్లి, ఉదయగిరి, అప్పసముద్రం, పుల్లాయపల్లి, జీ.చెరువుపల్లి, చెర్లోపల్లి, అయ్యవారిపల్లి, కొండాయపాళెం గ్రామాల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరినొకరు రంగులు చల్లుకుని కేరింతలు కొట్టారు. మరికొన్ని చోట్ల యువకులు డీజేలు ఏర్పాటు చేసి పండుగను ఆనందోత్స వాలతో జరుపుకున్నారు.

సంగం: మండలకేంద్రంలో చిన్నారులు ఒకరికొకరు రంగులు పూసుకుని ఆట పాటలతో నీళ్లు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. రోజంతా సందడి చేశారు.



కోటవీధిలో చిన్నారుల సంబరాలు



ఉదయగిరిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

యువత రాజకీయాల్లోకి రావాలి

ఉదయగిరి రూరల్, మార్చి 25: ప్రస్తుత పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివేకానంద యూత్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆవుల భూపతిరాజ తెలిపారు. సోమవారం స్థానిక శివాలయంలో యువకులతో కలిసి హోలీ వేడుకలను నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల సామాజిక వెనుకబాటుతనం, పొట్టకూటి కోసం వలసబాట పడుతున్న ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకుని వివేకానంద యూత్ ముందుకు వస్తుందన్నారు. రాజకీయాల్లోకి వచ్చే యువతకు తమ అండదండలు ఉంటాయన్నారు. అందులో భాగంగా జరనున్న సార్వత్రిక ఎన్నికల్లో యూత్ ఆధ్వర్యంలో నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. యువకులకు శిక్షణ శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. లీగల్ సెల్ సభ్యులు నంబూరు సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

ముస్లింలకు తోఫా అందజేత



సరుకులు అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

అనంతసాగరం, మార్చి 25: బొమ్మవరం పంచాయతీలోని అగ్రహారంలోని ముస్లిం కుటుంబాలకు సోమవారం వైఎస్సార్ ఫౌండేషన్ నిర్వాహకులు అక్కులరెడ్డి బాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డిలు రంజాన్ తోఫా అంద జేశారు. బియ్యం, చక్కెర, గోధుమపిండి, సేమియాలు, పప్పులు పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వారి వెంట అక్కులరెడ్డి రమణారెడ్డి, పెద్దనారాయణరెడ్డి, గూడూరు కృష్ణారెడ్డి, బి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మన ఫౌండేషన్ అధినేత ఔదార్యం



నగదును అందజేస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి, మార్చి 25: స్థానిక బీసీ కాలనీలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న షేక్ మహబూబ్‌బాషాకు సోమవారం మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సొంత నిధులతో ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి నీటిని అందిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలనీ వాసులకు శ్మశానం, రోడ్డు, కల్యాణ మండపం నిర్మించేం దుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నిసార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

ఉదయగిరి రూరల్: కృష్ణంపల్లి సచివాలయ పరిధిలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని ఆమె కోరారు.

నిరుపయోగంగా సోమశిల ఉప కాలువలు

ఆత్మకూరు, మార్చి 25: సోమశిల జలాలు చెంతనే ఉన్నా సాగునీటికి నోచుకోక ఆ గ్రామ రైతులు దశాబ్దకాలంగా భూములను బీడులుగానే పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సాగునీరు అందించేందుకు లక్షలాది రూపాయల నిధులతో నిర్మించిన ఉపకాలువలు నిరుపయోగంగా మారాయి. మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారాయి. అందుకు సోమశిల 12ఆర్ ఉపకాలువే ప్రత్యక్ష నిదర్శనం. నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడుకి చెందిన 175ఎకరాలకు సాగునీరు అందించేందుకు సోమశిల ఉత్తరకాలువ నుంచి 18ఏళ్ల కిందట 12ఆర్ ఉపకాలువ పనులు, కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. అప్పటినుంచి ఇప్పటివరకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిన దాఖలాలు లేవు. పదేళ్ల క్రితం కామిరెడ్డిపాడుకు విచ్చేసిన అప్పటి ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి 12ఆర్ ఉపకాలువ మరమ్మతుల విషయం తీసుకెళ్లారు. ఆయన నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో కొంత మేర పనులు జరగడంతో 20ఎకరాలకు పైబడి మాత్రమే సాగునీరు అందే అవకాశం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయకట్టు చివరి వరకు (150 ఎకరాలు) సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారు.

ఆనం సమక్షంలో టీడీపీలోకి చేరిక



ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

మర్రిపాడు,: పెగళ్లపాడుకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరారు. పార్టీ మాజీ మండలాధ్యక్షులు శాఖమూరి నారాయణ, శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో నెల్లూరులోని మాజీ మంత్రి ఆనం రామనారాయ రెడ్డి నివాసంలో పార్టీలో చేరారు. వారికి ఆనం రామనారా యణరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రేపు ధ్రువపత్రాల పంపిణీ

ఉదయగిరి రూరల్, మార్చి 25: పట్టణంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (న్యాక్) ద్వారా పీఎం విశ్వకర్మ పథకంలో గత రెండు నెలల క్రితం తాపీమేస్త్రీలుగా ఆరురోజులు శిక్షణ పొందిన వారికి బుధవారం న్యాక్ కార్యాలయంలో ధ్రువపత్రాలు పంపిణీ చేసినట్లు సోమవారం కేంద్రం నిర్వాహకులు లక్కినేని ప్రకాష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారు తప్పనిసరిగా హాజరై ధ్రువపత్రాలు తీసుకెళ్లాలని కోరారు.

వైభవంగా సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న దంపతులు

సంగం, మార్చి 25: కొత్తూరులోని బాలచౌడేశ్వరిదేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం సత్యనారాయణవ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో పలువురు దంపతులు వ్రతంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎన్డీఏ కూటమికి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ మద్దతు

వింజమూరు, మార్చి 25: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో ఉండవల్లిలో ఆదివారం తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు నివాసంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగతో కలిసి జరిపిన చర్చలు సఫలం అయినట్లు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేదర్‌మాదిగ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాలని మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత, మాదిగల సంక్షేమానికి ప్రభుత్వరంగ సంస్థలల్లోగా వాటా ఇవ్వాలని వారు డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సూచనలిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

వరికుంటపాడు: ఎన్నికల విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కావలి డీఎస్పీ వెంకటరమణ హెచ్చరించారు. సోమవారం జిల్లా సరిహద్దు ప్రాంతమైన భోగ్యంవారిపల్లి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి సమా చారాన్ని అందజేయాలన్నారు. మద్యం, నగదు తరలించే అవకాశం ఉన్నం దున ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆయన వెంట సీఐ గిరిబాబు, ఎస్ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా..!

- నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్



ఉదయగిరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, మార్చి 25: ప్రజాసేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం స్థానిక శోభ కాంప్లెక్స్‌లో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు ఆధ్వర్యంలో బీజేపీ మండలాధ్యక్షుడు నెల్లూరు వెంకటస్వామినాయుడు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమది వరికుంటపాడు మండలం యర్రంరెడ్డిపల్లి గ్రామమన్నారు. తమ కుటుంబం ట్రస్టు ఏర్పాటు చేసి నియోజకవర్గంలో రెండేళ్లుగా పేదలకు సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అన్నిరంగాల్లో వెనుకబడిన నియోజకవర్గాన్ని చూసి అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, డబ్బుపై తనకు వ్యామోహం లేదన్నారు. నియోజకవర్గంలో సమస్యలపై తనకు అవగాహన ఉందని, తాగు, సాగునీటి కష్టాలు తీర్చడంతో పాటు ప్రధానంగా పరిశ్రమలు నెలకొల్పి వలస నివారణకు చర్యలు చేపడతానన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కాకర్ల విజయానికి సమష్టిగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, మన్నేటి వెంకటరెడ్డి, సీహెచ్ బయ్యన్న, గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, మూలె బాలకృష్ణారెడ్డి, మేకపాటి మాల్యాద్రినాయుడు, ఆంధ్రా పరంధామిరెడ్డి, పులిచర్ల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా నేనుంటానని నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. మండలంలోని పోకలవారిపల్లిలోని టీడీపీ నాయకులు చింతల శ్రీనివాసులు స్వగృహంలో ఉదయగిరి అధ్యక్షతన పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అందరి సహకారంతో అఖండ విజయం సాధించి ఉదయగిరికోటపై తెలుగుదేశం జెండా ఎగరవేస్తామన్నారు.

కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో వెలసి ఉన్న కోదండరామాలయ సంప్రోక్షణ కార్యక్రమాలు సోమవారం జరిగాయి. జీవ ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు మంగళవారం నుంచి గురువారం వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పశుపోషణ భారం!

- వెంటాడుతున్న వరి గడ్డి కొరత
- ట్రాక్టర్ గడ్డి రూ.30 వేలు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- ఆందోళనలో పాడి రైతులు



కొనుగోలు చేసి తెచ్చుకున్న వరి గడ్డి

వలేటివారిపాలెం, మార్చి 25 : ప్రభుత్వ ప్రోత్సాహం కరువడంతో పశు పోషణ భారంగా మారింది. గ్రామాల్లో వ్యవసాయం తరువాత అధిక శాతం మంది పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయంలో పాడి పరిశ్రమకు ఇచ్చిన అనేక ప్రోత్సాహకాలు ఇప్పుడు ఇవ్వకపోవడం, ట్రాక్టర్ వరిగడ్డి అన్ని ఖర్చులతో కలిపి ఇంటికి చేరేటప్పటికీ రూ.30 వేలు అవుతుండడంతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో అధికారిక లెక్కల ప్రకారం 14,893 గేదెలు, 460 గోవులు, 25,736 గొర్రెలు, 7063 మేకలు ఉన్నాయి. వీటి పోషణ, భద్రతకు గత టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాలు, ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాస క్షేత్రాల విస్తరణ, రాయితీపై పాతర గడ్డి సరఫరా, దాణా మృతం పంపిణీ తదితర పథకాలు అమలు చేసింది. ఈ పథకాలకు వైసీపీ ప్రభుత్వం మంగళం పాడి అటకెక్కించింది. దీంతో పశు పోషకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనిపై వలేటివారిపాలెం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు బ్రహ్మయ్య మాట్లాడుతూ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పశుగ్రాసం కొరత తదితర అంశాలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.



కందుకూరు : వాసవీకాలనీలో హోలీ వేడుకల్లో చిన్నారులు

కందుకూరు, మార్చి 25: హోలీ పర్వదినాన్ని పట్టణంలో సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారుల రంగుల కేళీ హోలీ అంటూ గులాంలు, రంగునీళ్లు చల్లుకున్నారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు ఆధ్వర్యంలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాసవీనగర్, పెద్దబజారుల్లో ఆర్యవైశ్య మహిళలు, చిన్నారులు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఉత్సాహంగా హోలీ సంబరాలు



కలిగిరి : హోలీ సంబరాల్లో చిన్నారులు

వలేటివారిపాలెం : మండలంలో హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువకులు, మహిళలు, ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని ఒకరిపై మరొకరు రంగులు చల్లుకున్నారు. రంగుల కేళీ, రంగేలీ హోలీ అంటూ ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు.

కలిగిరి : మండలంలో హోలీ వేడుకలను మహిళలు, చిన్నారులు ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాఠశాలలు, కార్యాలయాలకు సెలవు కావడంతో విద్యార్థులు, యువకులు రంగులు చల్లుకుం టూ కేరింతలు కొడుతూ వీధుల్లో తిరుగుతూ సందడి చేశారు.

అంకమ్మ ఆలయంలో ఇంటూరి పూజలు



అంకమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఇంటూరి

లింగసముద్రం, మార్చి 25 : లింగసముద్రంలోని అంకమ్మ ఆలయంలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అర్ధకుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన అంకమ్మ తిరునాళ్లకు హాజరైన ఆయనకు మాజీ ఎంపీటీసీ అర్ధకుల దుర్గాభవాని, అర్ధకుల వెంకటేశ్వరరావులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కండే మాలకొండయ్య, అడపా రంగయ్య, మద్దెల రామారావు, గాలంకి ప్రసాద్, జంపాల శివప్రసాద్, సీహెచ్ బాలకోటయ్య, గొల్లపల్లి వెంకటేశ్వర్లు, ఏ.చినసత్యం, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు పన్నినా ఆర్యవైశ్య పరిచయ వేదిక విజయవంతం

కావలి, మార్చి 25: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డితో ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన పరిచయ వేదికను భగ్నం చేసేందుకు అధికారపార్టీ నేతలు ఎన్ని కుట్రలు, పన్నాగాలు పన్నినా పరిచయ వేదిక విజయవంతమైందని ఆర్యవైశ్య నేతలు తెలిపారు. కావలిలో సోమవారం జరిగిన కార్యక్రమంలో టీడీపీలోని ఆర్యవైశ్య ముఖ్యనేతలు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల పరిచయ వేదికను భగ్నం చేసేందుకు అధికారపార్టీకి చెందిన నేతలు కొందరి ఆర్యవైశ్యులకు ఫోన్‌లు చేసి బెదిరించారన్నారు. కార్యక్రమం నిర్వహించే కల్యాణ మండపం వద్దకు ముందు రోజున అధికారులను పంపించి దానికి అనుమతులు ఉన్నాయా లేవా అని తనిఖీ చేయించారన్నారు. కార్యక్రమం జరిగే సమయంలో కూడా పోలీసులను పంపి సమయం అయిపోయిందని అక్కడ నుంచి బయటకు పంపేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. ఎన్నికుతంత్రాలు, కుట్రలు పన్నినా ఆర్యవైశ్యులు ఈ సమావేశానికి వచ్చి విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నేతలు తిరువీధి ప్రసాద్, చవల రామకృష్ణ, పోతుగంటి శ్రీకాంత్, తటవర్తి రమేష్, తటవర్తి వాసు, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే ముస్లింల అభివృద్ధి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఇంటూరి సౌజన్య

కందుకూరు, మార్చి 25: తెలుగుదేశం ప్రభుత్వంలోనే ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేశారని, రానున్న టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వంలో ముస్లింల అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు అమలుచేసేందుకు చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య పేర్కొన్నారు. పట్టణంలోని 6వ వార్డులో సోమవారం ఆమె స్థానిక మహిళలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ అహ్మద్‌బాషా, తహరాబేగం, షాహిదా, మహబ్బానీ, శంషాద్, రూబీ, ఫిరోజ్, బాబు, దావూద్ సలీం, మియా, గౌస్, సమద్, హుస్సేన్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

చివరిసారి పోటీలో ఉండాలనుకుంటున్నా !

- విజయసాయిరెడ్డితో విష్ణు

అల్లూరు, మార్చి 25 : తాను చివరిసారిగా పోటీ చేయాలని అనుకుంటున్నానని, ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసుకున్నానని తనను కలసిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు. సోమవారం విజయసాయిరెడ్డి అల్లూరులోని విష్ణు నివాసానికి చేరుకుని సుమారు గంటపాటు ఆయనతో భేటీ అయ్యారు. ఆయనను వైసీపీలో చేరాలని కోరారు. దీంతో తాను పోటీలో ఉంటానని చెబుతూ అయినప్పటికీ తన అనుచరులతో సమావేశమై అందరి అభిప్రాయాలను తీసుకొని తుది నిర్ణయాన్ని తెలుపుతానని విష్ణు చెప్పారు. ఆయన అనుచరులు విజయసాయిరెడ్డితో మాట్లాడుతూ తమ నాయకుడికి ఒక్క అవకాశం ఇచ్చి పోటీలో ఉండేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ వైసీపీకి మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అవసరం ఉండడంతో పార్టీలోకి ఆహ్వానించామన్నారు. అన్ని విషయాలు క్షుణ్ణంగా చర్చించామని, జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడి మరోసారి భేటీ అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, గోన గోపాల్‌రెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, మోహన్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి, కావ్యలకు మద్దతుగా ప్రచారం



ఇంటింటి ప్రచారంలో బీద గిరిధర్

అల్లూరు, మార్చి 25 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డిలను గెలిపించాలని టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ కోరారు. సోమవారం అల్లూరులో పోలేరమ్మకు పూజలు నిర్వహించిన అనంతరం పట్టణ పరిధిలోని అల్లూరుపేట 8వ వార్డు, చాకిరేవుగుంట, చవటపాలెం, పల్లిపాడు, కొండాయగుంట, అల్లిమడుగు కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, అరగల రమణయ్యపలగాటి శ్రీనివాసులు రెడ్డి, అనూరాధ, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, బిట్రగుంట చైతన్య, యేటూరు దయాకర్, పోట్లూరు శ్రీనివాసులు, మేడా శ్రావణ్‌కుమార్‌రెడ్డి, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు కారుమంచి కార్తీక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'ప్రకాశం'లో ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల విడుదల

కందుకూరు, మార్చి 25: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ (అటానమస్) ఫస్ట్ ఇయర్ తొలి సెమిస్టర్ ఫలితాలను సోమవారం విడుదల చేశారు. అన్ని బ్రాంచిలలో 42.47 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా సీఎస్‌ఈలో అత్యధికంగా 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్‌లు అధ్యాపకులను అభినందించారు.

రూ.1.55 లక్షల పట్టివేత

వలేటివారిపాలెం, మార్చి 25 : మండలంలోని మాలకొండ బోర్డర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో కారులో వస్తున్న ఓ వ్యక్తి వద్ద రూ.1.55 లక్షల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, వలేటివారిపాలెం పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసే క్రమంలో కడప జిల్లా రాజంపేట నుంచి వలేటివారిపాలెం మండలంలోని పోలినేనిచెరువుకు ఒక వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో నగదు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ నగదును ట్రెజరీలో జమ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం పోలీసులు తెలిపారు.

వైసీపీ రంగులపై సున్నం



ప్రహరీ, దిమ్మెలకు వేసిన తెల్ల సున్నం

కావలి, మార్చి 25: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా కావలి పట్టణం ముసునూరు మహాలక్ష్మ మ్మ ఆలయం వద్ద ట్రంకు రోడ్డు వెంబడి ఒక ఇంటి ప్రహ రీకి, దాని ముందున్న జెండా దిమ్మెకు వైసీపీ రంగులు వేసి ఉండగా శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు అనే శీర్షిక ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఆ ఇంటి ప్రహరీకి, దిమ్మెకు ఉన్న వైసీపీ రంగులను చెరిపేసి వాటిపై సున్నం వేయించారు.

ప్రజాసత్తా, ముస్లిం సత్తా జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రేష్మ

కావలిటౌన్, మార్చి 25: ప్రజాసత్తా, ముస్లిం మైనారిటీ సంక్షేమ అనుబంధ విభాగం ముస్లిం సత్తా జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కావలికి చెందిన ఎస్‌కె రేష్మ ఎంపికయ్యారు. ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు శోభన్‌బాబు సోమవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు నియామక పత్రం అందించారు.

ఆనెమడుగు వాసులు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన ఆనెమడుగు వాసులు

కావలి, మార్చి 25: కావలి మండలం ఆనెమడుగు పంచాయతీ ప్రజలు సీనియర్ నేత ఉప్పాల యల్లారావు ఆధ్వర్యంలో సోమవారం టీడీపీలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సోదరులు మాల్యాద్రిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, పరిశీలకులు కండ్లగుంట మధుబాబు నాయుడు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయంలో 'ఆరోగ్య సురక్ష'

వలేటివారిపాలెం, మార్చి 25 : మండలంలోని నేకునాంపురం గ్రామ సచివాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని శింగమనేనిపల్లె, నేకునాంపురం గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు

కావలిటౌన్, మార్చి 25: విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు జరిగిన ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుకర్ పర్యవేక్షణలో జరిగిన వారోత్సవాల్లో చివరి రోజు మొక్కలు నాటి పచ్చదనం యొక్క ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ, విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్ రెడ్డిలు ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందించారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 25: స్థానిక పెద్దూరులో సీతాలక్ష్మణ సమేత కోదండరాముడి ఆలయంలో జీర్ణోద్ధరణ, మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనము తదితర కార్యక్రమాల అనంతరం ఆలయ రాజగోపురంపై నవ కలశాలను ప్రతిష్ఠించారు. అనంతరం సీతాలక్ష్మణ సమేత కోదండరాముడితో పాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉత్సవమూర్తులకు తిరుమంజనం, మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. కుంభాభిషేకం పూజల్లో వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళికృష్ణారెడ్డి, దాతలు, భక్తులు పాల్గొన్నారు.


కలశంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

సర్వేపల్లి అభివృద్ధి సోమిరెడ్డితోనే సాధ్యం

ముత్తుకూరు, మార్చి 25: సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధి సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డితోనే సాధ్యమని టీడీపీ సర్వేపల్లి నియోజక వర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ముత్తుకూరు ఇందిరమ్మ కాలనీలో ఆయన తన సతీమణి సోమిరెడ్డి శృతితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో టీడీపీ ప్రభుత్వం వస్తుందని, వైసీపీ అరాచకాలకు అడ్డుకట్ట వేసి పేదలకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, నాయకులు కోదండయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

పలువురికి సోమిరెడ్డి పరామర్శ

మనుబోలు: మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం పలు గ్రామాల్లో పలువురిని పరామర్శించారు. ఎల్‌ఎన్‌పురంలో టీడీపీ నాయకుడు కరియావుల మురళీ నాయుడు తండ్రి చంద్రపనాయుడు ఇటీవల మృతిచెందగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అలాగే వెంకన్నపాళెంలో అడపాల చెంచురెడ్డిని పరామర్శించారు. కాగితాలపూరులో టీడీపీ నాయకుడు చాన్‌బాషా మృతిచెందగా ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. వైసీపీ నాయకులు కట్టువపల్లిలో దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, వెంకన్నపాళెంలో అడపాల శివకుమార్‌రెడ్డి సోమిరెడ్డిని కలిసి ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు మధునాయుడు, నాయకులు సాని వెంకటరమణయ్య, తిక్కవరపు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

పొదలకూరు, మార్చి 25: పట్టణంలోని శివాలయ ప్రాంగణంలోని అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను సోమవారం అయ్యప్ప భక్తబృందం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, పూజ, హారతి, తీర్థ ప్రసాదాల వినియోగం, సాయంత్రం శివాలయం నుంచి ప్రత్యేక రథంపై స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా సుబ్రహ్మణ్యం ఆచారి, శ్రీసాయి ఫ్లవర్ డెకరేటర్స్ వ్యవహరించారు.


గ్రామోత్సవంలో స్వామివారు

ఉత్సాహంగా హోలీ సంబరాలు

వెంకటాచలం, మార్చి 25: స్థానిక శ్రీకృష్ణ మందిరంలో సోమవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు అలరించారు. ఈ సంబరాల్లో రాధే రాధే కృష్ణ మందిరం ట్రస్ట్ సభ్యులు మనోజ్‌కుమార్, వరదగల్లు హరిబాబు, మందిపాటి రమేష్‌బాబు పాల్గొన్నారు.


శ్రీకృష్ణ మందిరంలో హోలీ సంబరాలు జరుపుతున్న ట్రస్ట్ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలలో సోమవారం హోలీ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. హౌస్‌తోటలో యువతీ యువకులు హోలీ సంబరాలలో పాల్గొన్నారు.

గ్రామాల్లో మంత్రి కాకాణి ప్రచారం

మనుబోలు, మార్చి 25: మండలంలోని కొలనుకుదురు, కట్టువపల్లి గ్రామాల్లో సోమవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, నాయకులు కసిరెడ్డి ధనుంజయరెడ్డి, గుండాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రమణారెడ్డికాలనీలో...

పొదలకూరు: పంచాయతీ పరిధిలో కాకాణి రమణారెడ్డి కాలనీలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పెద్ద కుమార్తె కాకాణి పూజిత ఎన్నికల ప్రచారం చేశారు. జడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ మల్లికా చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ షకీరీబేగం, వార్డు మెంబరు అంజాద్ పాల్గొన్నారు.

నేడు బుచ్చిలో బహిరంగ సభ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 25 : బుచ్చిలోని టోల్‌ప్లాజా వద్ద మంగళవారం సాయంత్రం టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు రియల్టర్ భువనేశ్వరం మురళి తెలిపారు. నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ, కాంగ్రెస్, పీఆర్‌పీల నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు. ముందుగా రేబాల సెంటర్ వద్ద ఆంజనేయస్వామి గుడి నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహాలక్ష్మి నమోస్తుతే!


అష్టలక్ష్మి ఆలయంలో బంగారు చీరలో లక్ష్మీదేవికి పుష్పాభిషేకం

వైభవంగా లక్ష్మీ జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 25 : పాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా నగరంలోని మహాలక్ష్మి ఆలయాల్లో సోమవారం లక్ష్మీ జయంతిని వైభవంగా జరిపారు. సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, బంగారు చీర అలంకారం, పుష్పాభిషేకాలు జరిగాయి. అనంతరం అష్టలక్ష్మీ యాగం, రుద్రయాగం, భక్తులతో లక్ష కుంకుమార్చన జరిగాయి. సాయంత్రం పల్లకీసేవ జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్, ట్రస్టీలు పర్యవేక్షించారు.

- అయ్యప్పగుడి ప్రాంగణంలోని గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో మహాలక్ష్మి జయంతి వేడుకలు జరిగాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు, పూలంగిసేవ, పుష్పాభిషేకాలు జరిగాయి.
- మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణమందిరంలో వైభవలక్ష్మి అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది.


సుజాతమ్మ కాలనీలో లక్ష్మీ హోమం నిర్వహిస్తున్న రిత్వికులు


గాంధీనగర్ కృష్ణ మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతం

క్రైస్తవుల సంక్షేమానికి చంద్రబాబు ఎంతో చేశారు !

- టీడీపీ సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ

నెల్లూరు(వైద్యం), మార్చి 25 : చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట వేశారని మాజీ మంత్రి, టీడీపీ నగర అభ్యర్థి పొంగూరు నారాయణ వెల్లడించారు. సోమవారం గోమతినగర్ క్యాంపు కార్యాలయంలో క్రైస్తవులతో కలిసి సూపర్‌సిక్స్ పోస్టర్లను విడుదల చేశారు. నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 277 క్రైస్తవ ప్రార్థనా మందిరాలకు రూ.45 కోట్లు ఇచ్చారన్నారు. విదేశీవిద్యకు 68 మంది విద్యార్థులకు రూ. 15 లక్షలు అందించిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. 2500 మందిని జెరుసలేమ్ యాత్రకు పంపించారని, క్రిస్మస్ కానుక ఇచ్చారని తెలిపారు. అయితే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని రంగాల్లో క్రైస్తవులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. క్రిస్టియన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు మాట్లాడుతూ గతంలో బీజేపీతో పొత్తు ఉన్నప్పుడు చంద్రబాబు 11 సంక్షేమ పథకాలను క్రిస్టియన్ల కోసం కేటాయించారన్నారు. కొత్తగా సూపర్ సిక్స్‌తో కలిపి 17 పథకాలను అందచేయనున్నారని చెప్పారు. ఆ పథకాలను గడప గడపకు తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్, నారాయణ సతీమణి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


సూపర్ సిక్స్ పోస్టర్లు విడుదల చేస్తున్న నారాయణ

కాగా, 44వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి దర్శి హరికృష్ణ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు, క్లాత్ మర్చంట్స్ ఫాన్సీ అసోసియేషన్ సభ్యులు నారాయణను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ నెల 31న నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరిగే ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో పాల్గొనాలని ఆహ్వానించారు. మల్లికార్జున, గోపీకృష్ణ, సుబ్బయ్య, భాస్కర్, బాలాజీ, కృష్ణమూర్తి, కోట మధుసూదన్‌రావు, సతీష్, రాజా పాల్గొన్నారు.

అజీజ్‌ను కలిసిన సోమిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 25: టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను నగరంలోని ఆయన నివాసంలో మాజీ మంత్రి, సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అజీజ్‌ను సత్కరించిన పలు రాజకీయ అంశాలపై చర్చించారు.

విజయసాయిపై కోటంరెడ్డి ధ్వజం

నెల్లూరు(వైద్యం), మార్చి 25 : నువ్వే నెంబర్-2 దొంగవి.. నిన్ను హీరో అంటే ఎట్లా? అంటూ నెల్లూరు ఎంపీ వైసీపీ అభ్యర్థి విజయ సాయిరెడ్డిపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం నగరంలో ఆయన నివాసంలో కోటంరెడ్డిని మాజీమంత్రి, సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కలిసి పలు రాజకీయ అంశాలపై చర్చించారు. కాగా, మాజీమంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి కూడా కోటంరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మీడియాతో మాట్లాడారు. సాయిరెడ్డి విశాఖలో మొత్తం దోచేశారని, ఇక్కడ వైసీపీ మంత్రులు అంతా దోచేశారన్నారు. ఇక, నరసింహకొండ మాత్రమే మిగిలి ఉందని, దానిజోలికి వస్తే సర్వనాశనం అయిపోతారని హితవు పలికారు.

గెలుపోటములకు విద్యార్థులు, యువతే కీలకం

- రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(వైద్యం) మార్చి 25 : రాజకీయ పార్టీల గెలుపోటములకు విద్యార్థులు, యువతే కీలకమని రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నగరంలోని 32, 34,37,41 డివిజన్ల యువతతో పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఏ సర్వే చూసినా యువత 80 శాతం టీడీపీ వైపే ఉన్నారని పేర్కొన్నారు. అమంచర్ల పారిశ్రామికవాడను 100 శాతం సాధించి తీరుతామని, ఇందులో 10వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. 18 ఏళ్లు దాటిన యువత ఓటును నమోదు చేసుకోవాలని కోరారు.


పార్టీలో చేరిన వారితో కోటంరెడ్డి సోదరులు

రూరల్ టీడీపీలో చేరికలు

నెల్లూరు(వ్యవసాయం): రూరల్ నియోజకవర్గంలోని 30వ డివిజన్ కొత్తూరు వడ్డిపాళేనికి చెందిన వల్లెపు రమేష్, మల్లి సుధ వారి మిత్రబృందం సోమవారం శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కూకాటి హరిబాబు యాదవ్, మన్నేపల్లి రఘు, యానాదయ్య పాల్గొన్నారు.

వైసీపీ క్రిమినల్ పార్టీ కాదా..?

- జనసేన కిషోర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 25: బాగా నెరిసిన జుట్టుగల పెద్దాయన జనసేన పార్టీపై విమర్శలు చేస్తున్నారని, వైసీపీ క్రిమినల్ పార్టీ కాదా అని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ వైసీపీ నేత విజయసాయిరెడ్డిని ప్రశ్నించారు. జనసేనపై విజయసాయి విమర్శలకు వ్యతిరేకంగా సోమవారం గాంధీబొమ్మ సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. కిషోర్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కంచుకోట అని చెప్పుకుంటున్న వైసీపీ నాయకులు రాబోయే ఎన్నికల్లో జిల్లాలో ఒక్క సీటు అయినా గెలవగలరేమో సమాధానం చెప్పాలన్నారు. నేను లోకల్ అంటున్న విజయసాయిరెడ్డి 40 ఏళ్లుగా నెల్లూరులో కనిపించిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డికి ట్రిబుల్ ఎక్స్ సంస్కారవంతమైన సబ్బు పంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హసీనా, రేణుక, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

కార్యాలయం ప్రారంభం

నగరంలోని వెంకటేశ్వరపురం జనార్దన్ రెడ్డి కాలనీలో సోమవారం క్లస్టర్ ఇన్‌చార్జి షేక్ ఆలియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన కార్యాలయాన్ని పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు ప్రారంభించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నాయకులు, కార్యకర్తల సౌలభ్యం కోసం కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంతర్, అజయ్‌బాబు, మస్తాన్ పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

- పార్టీ కండువా కప్పిన నారాయణ

నెల్లూరు(వైద్యం), మార్చి 25 : నగరంలోని 48వ డివిజన్ నుంచి సోమవారం తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. చేరిన వారికి మాజీమంత్రి పొంగూరు నారాయణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో విశ్వబ్రాహ్మణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చెంగయ్య ఆచారి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. నారాయణ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనతో విసిగి వేశారి టీడీపీలోకి వస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాలలో హోలీ

నెల్లూరు (విద్య), మార్చి 25 : నగరంలోని వీఆర్ న్యాయ కళాశాలలో సోమవారం విద్యార్థులు హోలీ సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులంతా స్నేహపూరిత వాతావరణంలో మెలిగేందుకు, విద్యలో మరింత ఉత్తమంగా రాణించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉత్సాహానిస్తాయని చెప్పారు. ఇదే స్ఫూర్తిని ప్రతి పండుగకు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ లా స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాదిగలకు వైసీపీ పదవులివ్వలేదు

- సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నేత సుబ్బయ్య

నెల్లూరు(హరనాథపురం), మార్చి 25 : మాదిగలను వైసీపీ ప్రభుత్వం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుందేకాని గత ఐదేళ్లలో ఏలాంటి రాజకీయ పదవులను కేటాయించలేదని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య ఆరోపించారు. సోమవారం నగరంలోని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ భవన్‌లో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడు కాకి శ్రీనివాసులు జన్మదిన సన్మాన సభ జరిగింది. సుబ్బయ్య మాట్లాడుతూ మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన పార్టీలకే మాదిగలు ఓట్లు వేస్తారన్నారు. ఈ సందర్భంగా పలువురికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాకి ప్రసాదరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బర్రె శ్రీనివాసులు, మాతంగి కృష్ణ, జాలాది శ్రీనివాసులు, కన్యకేశ్వరరావు, విజయకుమార్, రియాజ్, రఘు, చిన్నయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలి

నెల్లూరు (విద్య), మార్చి 25 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు నిర్వహించే 2, 4 సెమిస్టర్ పరీక్షల తేదీలను వాయిదా వేయాలని ఏఐడీఎస్‌వో నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యార్థులను ఒత్తిడి, ఆందోళనకు గురి చేయవద్దన్నారు. యూజీసీ నిబంధనలకు అనుగుణంగా 90 రోజుల పనిదినాలు పూర్తవడం, పాఠ్యాంశాల బోధన జరిగిన తరువాతనే పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. ఏప్రిల్ 3వవారంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సర్క్యులర్ జారీ చేశారని, అయితే నిబంధనలకు విరుద్ధంగా 50 రోజుల పనిదినాల్లోనే తరగతులు నిర్వహించి పరీక్షల నిర్వహణకు తేదీలను ప్రకటించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నేత సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్ట్‌లో భోజన వితరణ

నెల్లూరు (విద్య), మార్చి 25 : నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల సత్యసాయి ట్రస్ట్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రోగుల సహాయకులకు భోజన వితరణ చేశారు. అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్ బాబు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుడు నందిమండలం నాగేశ్వరరావు సహకారంతో భోజన వితరణ చేశామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కే జయదేవ్, సభ్యులు డాక్టర్ ఎంఎస్ రెడ్డి, నలుబోలు బలరామయ్య నాయుడు, బాసం శేషగిరిరావు, సుబ్బరామిరెడ్డి, నారాయణరావు, పొన్నం రవిచంద్ర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 25 : నగరంలోని అయ్యప్పగుడిలో సోమవారం అయ్యప్ప జయంతి వేడుకలు జరిగాయి. ఉదయం గణపతి హోమం, అభిషేకాలు, ఉచ్ఛపూజ జరిగాయి. అనంతరం స్వామి వారికి దీపార్చన, విశేష పూజలు, భక్తులకు తీర్థ ప్రసాద, అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జీ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, సభ్యులు కత్తి మోహన్‌రావు, బీ మురళీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

కుప్పం అభివృద్ధిని తిరిగి పట్టాలెక్కిస్తా



వైసీపీ పాలనలో నాశనం చేశారు

బహిరంగ సభలో చంద్రబాబు



కుప్పం, మార్చి 25: 'కుప్పం అభివృద్ధికి 35 ఏళ్ల పాటు నేను పడిన కష్టాన్ని కేవలం ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వనాశనం చేశారు. అధికారంలోకి రాగానే తిరిగి అభివృద్ధిని పట్టాలెక్కిస్తా'నని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. దీనికి అవసరమైన అన్ని ప్రణాళికలు రచించి అమలు చేస్తామని చెప్పారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ఆయన కుప్పం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆర్టీసీ బస్టాండు సర్కిల్లో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో రెండంకెల అభివృద్ధి సాధిస్తే, కుప్పంలో మూడంకెల అభివృద్ధి తీసుకొస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఇంకా ఏం చెప్పారంటే..

శాటిలైట్ టౌన్‌షిప్‌గా కుప్పం

కుప్పాన్ని శాటిలైట్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేస్తా. తమిళనాడు, బెంగళూరుతో అనుసంధానం చేయడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచుతా. మేజర్ పంచాయతీకి రూ.కోటి, మైనర్ పంచాయతీకి రూ.రెండు కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించి నిరంతర అభివృద్ధికి బాటలు వేస్తా. నేను చేసే అభివృద్ధి పనులకు ఈ నిధులు అదనం.

ఎడ్యుకేషన్ హబ్‌గా..

ప్రభుత్వ రంగంలోనూ పలు ఉన్నత విద్యా సంస్థలు ఏర్పాటు చేస్తా. దేశంలోని నలుమూలల నుంచి విద్యార్థులు ఇక్కడ వచ్చి చదువుకునేలా ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా. తద్వారా స్థానిక ప్రజల జీవన భృతి పెంచుతా.

వన్యప్రాణుల నుంచి పంటలకు రక్షణ

టీడీపీ హయాంలో ఏనుగులు, ఇతర వన్యప్రాణుల కట్టడికి ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్తు కంచె, కందకాల నిర్వహణను జగన్‌రెడ్డి గాలికి వదిలేశారు. దీనివల్ల ఈ ఐదేళ్లలో వేల ఎకరాల పంట నష్టంతోపాటు కొందరు రైతులూ ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది.నేను అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పొరపాట్లను సరిదిద్దుతా.

మహిళా సాధికారతకు ఇక్కడినుంచే శ్రీకారం

కుప్పం, మార్చి 25: 'మీ కష్టాలు చూశా. కరిగిపోయా. వాటి నుంచి బయట పడేయాలన్న ప్రధాన ఉద్దేశంతోనే మహిళా సాధికారత కల్పించాలని పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కుప్పంనుంచే శ్రీకారం చుట్టాను' అని చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కుటుంబ మహిళా సాధికారతా సభ్యుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంలో తాను అధికారంలో ఉన్నప్పుడు మహిళలకోసం అమలు చేసిన పథకాల గురించి చంద్రబాబు వివరించారు. ఇప్పుడు అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధికింద ప్రతి మహిళకు రూ.15 వేలు, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి పలు పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మహిళల ఆదాయాన్ని రెండు రెట్లు పెంచడానికి హామీ ఇస్తున్నానని తెలిపారు.

మగాళ్లకు చెప్పి ఓట్లేయించండి

'టీడీపీ వల్ల మీకు ఎంతో మేలు జరిగింది. ఆ నిజం మీకు తెలుసు. అందువల్ల ఎన్నికల్లో టీడీపీకి ఓటేయమంటూ ఇంట్లో మగాళ్లను డిమాండు చేయండి. లేదంటే భోజనం పెట్టేది లేదని చెప్పండి. మీ భవిష్యత్తుకోసం, రాష్ట్రం కోసం 40 రోజులపాటు పనిచేయండి' అని పిలుపునిచ్చారు. వైసీపీ దుర్మార్గ పాలనలో ఆడబిడ్డలకు రక్షణ కరవైందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి తాగి, తల్లీబిడ్డలకు తేడా లేకుండా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. డ్రగ్స్ మాఫియానూ ప్రస్తావించారు. ఆడబిడ్డల జోలికొస్తే అదే అఖరి రోజు అన్నంతగా పాలన సాగిస్తానని హామీ ఇచ్చారు. 'మీరంతా రాజకీయాల్లోకి రావాలి. ఆ వేగానికి మగవాళ్ల కుర్చీలు వెదుక్కోవాలి' అంటూ చంద్రబాబు చమత్కరించారు.



రేపటినుంచీ చంద్రబాబు ప్రజాగళం సభలు

పలమనేరు బహిరంగసభతో ప్రారంభం

అదే రోజు పుత్తూరు, మదనపల్లెల్లో కూడా

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 27వ తేదీ బుధవారం నుంచీ ప్రజాగళం పర్యటన చేపట్టనున్నారు. రోజూ మూడు నుంచి నాలుగు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు. ప్రజలు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందులు పడుతున్నారో తెలుసుకుని.. వారి గళాన్ని రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేయడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశం.బుధవారం ఉదయం 9.30గంటలకు పలమనేరు నుంచీ ప్రజాగళం పర్యటన మొదలు పెట్టనున్నారు. తొలిరోజు పలమనేరుతో పాటు పుత్తూరు, మదనపల్లెల్లో కూడా పర్యటించనున్నారు. బుధవారం కుప్పం నుంచీ పలమనేరు చేరుకుని ఉదయం ప్రజాగళం తొలి బహిరంగసభలో పాల్గొంటారు. అక్కడ నుంచీ రోడ్డుమార్గాన పుత్తూరు పట్టణం చేరుకుని మధ్యాహ్నం 3 గంటలకు రోడ్‌షో అనంతరం బహిరంగ సభల్లో పాల్గొంటారు. అనంతరం పుత్తూరు నుంచీ హెలికాప్టర్‌లో మదనపల్లె చేరుకుని రాత్రి 7 గంటలకు జరిగే బహిరంగసభలో పాల్గొంటారు.ప్రజాగళం బహిరంగసభ విజయవంతానికి నగరి టీడీపీ ఇంచార్జి గాలి భానుప్రకాష్‌తో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాలైన జీడీనెల్లూరు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఇంచార్జులు, అభ్యర్థులు డాక్టర్ థామస్, పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం కృషి చేస్తున్నారు. భారీ జనసమీకరణపై వీరంతా దృష్టి పెట్టారు. ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక జిల్లాలో అధినేత పాల్గొంటున్న తొలి బహిరంగసభ కావడంతో దీన్ని పార్టీ నేతలు, శ్రేణులు ప్రతిష్టాత్మకంగా పరిగణిస్తున్నాయి. దీంతో తొలి బహిరంగసభను నభూతో అన్న రీతిలో నిర్వహించేందుకు పార్టీ నేతలు శ్రమిస్తున్నారు.

నేడు సుప్రీం సీజే తిరుపతి రాక

ఎస్వీయూలో వర్క్‌షాప్‌కు హాజరు

తిరుపతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి ధనుంజయ వై చంద్రచూడ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం తిరుపతి రానున్నారు. కలెక్టరేట్‌కు అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం 9 గంటలకు బెంగళూరు నుంచీ విమానంలో బయల్దేరి 10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు తిరుపతి ఎస్వీయూలో లా కోర్సులు ప్రారంభించి పదేళ్లవుతున్న సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ లీగల్ ఎడ్యుకేషన్ (న్యాయవిద్యలో కృత్రిమ మేధ) అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్కుషాపును ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించి న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు మహాలక్ష్మీ పావని, జేబీ గుప్తా తదితరులు కూడా హాజరు కానున్నారు.రాత్రి 8 గంటలకు బయల్దేరి తిరుమల చేరుకునే సీజే రాత్రికి అక్కడే బస చేస్తారు. బుధవారం వేకువ జామున కుటుంబంతో శ్రీవారిని దర్శించుకుని ఉదయం 9 గంటలకు బయల్దేరి తిరుపతి చేరుకుంటారు. 11.30 గంటలకు విమానంలో బయల్దేరి హైదరాబాదు వెళ్ళనున్నారు.

నేడు తిరుమలకు చిరంజీవి

తిరుపతి అర్బన్, మార్చి 25: ప్రముఖ సినీనటుడు చిరంజీవి, ఆయన తనయుడు రాంచరణ్ కుటుంబ సభ్యులతో మంగళవారం తిరుపతికి రానున్నారు. ప్రత్యేక విమానంలో సాయంత్రం 4గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుమల చేరుకుని రాత్రికి బసచేస్తారు. బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. సాయంత్రం హైదరాబాదుకు తిరుగుప్రయాణమవుతారు. బుధవారం రాంచరణ్ జన్మదినం సందర్భంగా తిరుమల పర్యటనకు వస్తున్న వారికి స్వాగతం పలికేందుకు మెగా అభిమానులు, జనసేన సైనికులు విమానాశ్రయానికి రావాలని అఖిలభారత చిరంజీవి యువత ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు పూల ప్రభాకర్ ఓ ప్రకటనలో కోరారు.

ఓటరు జాబితాలో మీ పేరుందా?

- కొత్తగా నమోదుకు ఏప్రిల్ 15 వరకు గడువు
- చిరునామా మార్పునకు అవకాశం లేదు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలంటే ఓటరు జాబితాలో పేరు ఉందో... లేదో చూసుకోవాలి. జనవరిలో విడుదల చేసిన తుది జాబితాకు అదనంగా ఇటీవల నమోదు చేసుకున్న ఓటర్ల పేర్లను సైతం చేర్చారు. 18 ఏళ్ల నిండినవారు ఏప్రిల్ 15వ తదీలోపు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ గడువు ఇచ్చింది. అడ్రస్ మార్పునకు(షిఫ్టింగ్)కు అవకాశం లేదు. ఒకవేళ పేరులో తప్పుంటే సరిచేసుకోవచ్చు. జిల్లాలో తుది జాబితా తర్వాత ఇటీవల ప్రకటించిన ఓటర్ల సంఖ్య 17,94,730కు చేరుకుంది. తుది జాబితాను పోలింగ్ కేంద్రాలు, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినప్పటికీ చాలామంది చూసు కోలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో జాబితాలో ఓటు ఉందా లేదా అనేది పరిశీలించుకోవాలని అధికారులు కోరుతున్నారు.



కొత్త ఓటరు నమోదు ఇలా

ఓటరు నమోదు అయినప్పటికీ ఎన్నికల రోజున జాబితాలో చాలా మంది తమ పేరు లేదని ఆందోళన చెందుతుంటారు. దాని బదులు ముందుగానే మన పేరు చూసుకోవడం మంచిది. ఒకవేళ పేరు కనిపించకపోతే వెంటనే కొత్తగా ఓటరు నమోదకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అర్హతను పరిశీలించి అధికారులు ఓటేసే హక్కు కల్పిస్తారు. గ్రామ, వార్డు సచివాలయం, తహసీల్దారు కార్యాలయంలోని బూత్‌స్థాయి అధికారుల(బీఎల్‌వోల)కు దరఖాస్తులు అందజేయాలి. ఓటర్ హెల్ప్ లైన్ యాప్ సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చు. కొత్త ఓటర్ల నమోదుకు ఏప్రిల్ 15వరకు గడువు ఇచ్చింది.

ఓటు హక్కుకు దూరంగా యువత

జిల్లాలో 18-19 ఏళ్ల మధ్య ఉన్నవారు 36,162మంది ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. జనాభా అంచనా ప్రకారం 55వేల మందికి పైగా యువత ఉండగా 18,738మంది ఓటరు నమోదుకు దూరంగా ఉన్నారు. ఇప్పటికైనా మేల్కొని ఏప్రిల్ 15లోపు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని జిల్లా అధికారులు కోరుతున్నారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లునిండిన వారు కూడా కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

వైభవంగా తుంబురతీర్థ ముక్కోటి

24 వేల మంది భక్తుల రాక


తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లోని తుంబురతీర్థ ముక్కోటి వైభవంగా జరిగింది. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా తుంబుర తీర్థ ముక్కోటిని నిర్వహించారు. ఆదివారం 15,750 మంది, సోమవారం 8,250 మంది భక్తులు తీర్థానికి వెళ్లారు. పుణ్యస్నానాలు ఆచరించి, తుంబురనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా టీటీడీ అన్న ప్రసాదాలు అందజేసింది. పలుచోట్ల షెడ్లు, మార్గం మధ్యలో నిచ్చెనలు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు.





తీర్థానికి వెళ్లివచ్చిన భక్తుడి మృతి

తుంబుర తీర్థానికి వెళ్లి వచ్చిన తమిళనాడు పెరుంగలత్తూరుకు చెందిన రామకృష్ణన్ దక్షణ మూర్తి (50)మృతి చెందారు. తీర్థానికి వెళ్లి సాయంత్రానికి తిరుమలకు తిరిగి చేరుకున్నాడు. అలసటతో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయన్ను అంబులెన్స్‌లో తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.



వెంకటగిరిలో వైసీపీకి భారీ షాక్

నేదురుమల్లిపై రెబెల్ అభ్యర్థిగా పోటీ చేస్తానన్న డీసీసీబీ మాజీ చైర్మన్ ధనంజయరెడ్డి

సేవ్ వెంకటగిరి పేరిట అనుచరులతో భారీ ర్యాలీ





సేవ్ వెంకటగిరి సభలో మాట్లాడుతున్న ధనంజయరెడ్డి - వైసీపీ నాయకుల ర్యాలీ

వెంకటగిరి, మార్చి 25 : వెంకటగిరి నియోజకవర్గంలో వైసీపీకి సొంత పార్టీ వర్గాల నుంచే భారీ షాక్ తగిలింది. పార్టీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిపై రెబెల్ అభ్యర్థిగా పోటీ చేస్తానంటూ అదే పార్టీకి చెందిన నెల్లూరు డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి ప్రకటించారు. సోమవారం నియోజకవర్గవ్యాప్తంగా ఆరు మండలాల నుంచీ భారీగా తరలివచ్చిన అనుచరులతో వెంకటగిరిలో సేవ్ వెంకటగిరి పేరిట నిర్వహించిన సమావేశంలో రామ్‌కుమార్‌రెడ్డిపై అసమ్మతి నేతలు ధనంజయరెడ్డి,కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి నిప్పులు చెరిగారు. వైసీపీలో కష్టపడ్డవారికి గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అనుభవం లేని వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించారని ఆరోపించారు. మూడు పార్టీలు మారి వైసీపీలోకి వచ్చారంటూ నేదురుమల్లిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కోసమో లేక జగన్ కోసమో నేదురుమల్లి వైసీపీలోకి రాలేదని, తన ఉనికి కోసం వచ్చాడని ఆరోపించారు. వెంకటగిరిలో కరెక్టుగా 25 మంది మున్సిపల్ కౌన్సిలర్ల పేర్లు కూడా చెప్పలేరని ఎద్దేవా చేశారు. ప్రెస్‌మీట్లు పెట్టడం తప్ప పార్టీలో నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం అతడికి తెలియద న్నారు. సమన్వయం అంటే అందరినీ కలుపుకునిపోయి పనిచేయడమని, అంత తప్ప 400 రోజుల్లో 200 ప్రెస్ మీట్లు పెట్టడం కాదని ఎగతాళి చేశారు. నియోజకవర్గానికి వచ్చాక కనీసం ఒక్క పనైనా చేశావా? ఏ ఎన్నికల్లో అయినా పనిచేశావా? అంటూ ప్రశ్నించారు. దివంగత నేదురుమల్లి జనార్దన రెడ్డి, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి నియోజకవర్గానికి చాలా మంచి చేశారని ప్రశంసిస్తూనే రామ్‌కుమార్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. వెంకటగిరిలో తండ్రి విగ్రహం పెట్టారని, విగ్రహం పెట్టక ముందు ప్రభుత్వ ఆస్తిగా వున్న ఆ స్థలం తర్వాత ప్రైవేటు ఆస్తిగా ఎలా మారిందో చెప్పాలన్నారు. వెంకటగిరిలో పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వకుండా వారి కడుపు కొట్టారని ఆరోపించారు. మండలాలను నాశనం చేశారని, అవినీతి గురించి మాట్లాడే రామ్‌కుమార్‌రెడ్డి మామూళ్ళు తీసుకోవడం లేదా అని ప్రశ్నించారు. అనుచరులందరూ ఆశీర్వదిస్తే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిపై రెబెల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ధనంజయరెడ్డి అభ్యర్థించారు.నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో గట్టి పట్టున్న ధనంజయరెడ్డి, సీనియర్ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి తొలి నుంచీ రామ్‌కుమార్‌రెడ్డిని వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు టికెట్ ఇవ్వవద్దని పలుమార్లు అధిష్టానాన్ని కోరారు. అయితే పార్టీ నేదురుమల్లికే టికెట్ ఖరారు చేసి అధికారికంగా ప్రకటించేయడంతో అసమ్మతి వర్గం అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధపడింది. అందులో భాగంగా ధనంజయరెడ్డి, కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డిలు సోమవారం నియోజకవర్గవ్యాప్తంగా ఆరు మండలాల నుంచీ అనుచరులను రప్పించి వెంకటగిరిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలేరమ్మ ఆలయంలో పూజలు జరిపి ఓ కళ్యాణ మండపంలో సమావేశమయ్యారు.వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి బాస్కరరావు, బాలాయపల్లి ఎంపీపీ భాస్కరరెడ్డి, వెంకటగిరి ఎంపీపీ తనూజరెడ్డి భర్త శివారెడ్డి, డక్కిలి జడ్పీటీసీ కలిమిలి రాజేశ్వరి, రాపూరు జడ్పీటీసీ ప్రసన్న, ఎంపీపీ ప్రసన్న, పెంచలకోన దేవస్థానం చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి ,40మంది ఎంపీటీసీలు, 30 మంది సర్పంచులతో పాటు భారీ సంఖ్యలో అనుచరులు పాల్గొనడం గమనార్హం. ఈ క్రమంలో జగన్ ఫొటో పెట్టి సమావేశం నిర్వహించడంపై నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆర్వోకి ఫిర్యాదుచేశారు. దీంతో సీఐ సంగమేశ్వరరావుకు ఏఆర్వో ఫిర్యాదు చేయడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందిని వెంటబెట్టుకొని సీఐ సమావేశం జరిగే ప్రాంతానికి చేరుకొన్నారు. అప్పటికే సమావేశం పూర్తికావడంతో వెనుదిరిగారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్(మంగళవారం):సా. 6.27
సహరి (బుధవారం) : ఉ. 4.53

చెలరేగుతున్న మట్టి మాఫియా

అనుమతుల పేరుతో అక్రమ తవ్వకాలు ● పరిశ్రమలకు, లేఅవుట్లకు తరలింపు ● చోద్యం చూస్తున్న అధికారులు





మంగళంపాడు చెరువులో మట్టిని తవ్వి టిప్పరుకు లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్ - పెరిమిటిపాడు చెరువులో మట్టి తవ్వడంతో ఏర్పడిన గుంతలు

సూళ్లూరుపేట, మార్చి 23: సూళ్లూరుపేట నియోజకవర్గంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. కోడ్ అమల్లోకి రావడంతో అధికారులంతా ఎన్నికల నిర్వహణపై దృష్టిపెట్టారు. ఇదే అదునుగా కొందరు వైసీపీ నాయకులు ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఎక్కువగా పంటపొలాలు రియల్ ఎస్టేట్ వెంచర్లగా మారిపోయాయి. ఈ వెంచర్ల పనులకు, పరిశ్రమలకు కేటాయించిన భూముల అభివృద్ధికి మట్టి, గ్రావెల్ అవసరం కావడంతో అక్రమార్కుల కన్ను పడింది. చెరువులు, ప్రభుత్వ భూములు అన్న తేడా లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వి సమీపంలోని సెజ్‌లో ఉన్న పరిశ్రమలకు, వెంచర్లకు తరలించి సొమ్ముచేసుకొంటున్నారు. అనుమతులు లేకుండా రేయింబవళ్లు అక్రమ రవాణా సాగుతున్న పట్టించుకొనే అధికారులే కరువయ్యారు. సూళ్లూరుపేట మండలం మంగళంపాడు చెరువులో నిబంధనలకు విరుద్ధంగా రోజూ పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా శ్రీసిటిలోని కొన్ని పరిశ్రమల భూములకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ చెరువులో మట్టిని తవ్వుకొనేందుకు అడ్డుచెప్పకుండా ఆ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడికి కడపకు చెందిన గ్రావెల్ మాఫియా కొంత నగదు అందజేసినట్లు సమాచారం. అదేవిధంగా సూళ్లూరుపేట నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే రోడ్డు పక్కనే పెరిమిటిపాడు చెరువు మట్టిని అధికార పార్టీ నాయకుడు సమీపంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌కు అక్రమంగా రవాణా చేస్తున్నారు. మూడు రోజుల నుంచి మన్నారుపోలూరు కండ్రిగ చెరువు పక్కనే ఉన్న సర్వే నెంబరు 285, 286లో గిరిజనులకు ఇచ్చిన భూముల్లో ఎక్స్‌కవేటర్ల సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల తరలిస్తున్నారు. ఇక్కడ నుంచి గ్రావెల్, మట్టిని సమీంపలోని పరిశ్రమలకు, వెంచర్లకు తరలిస్తే యూనిట్‌కు రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. అదే 20 కిలోమీటర్ల పరిధిలో సరఫరా చేస్తే రూ.5 వేలకు పైబడి తీసుకుంటున్నారు. ఒక టిప్పరుకు 6నుంచి 12 యూనిట్ల మేర వేసుకొనే సదుపాయం ఉంది. ఈ లెక్కన టిప్పరు గ్రావెల్ మట్టిని రూ.15 వేలు పైబడి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రావెల్ సరఫరా చేసిన అధికార పార్టీకి చెందిన నాయకుడికి ఓ పరిశ్రమ యాజమాన్యం రూ.25లక్షల మేర బిల్లులు సమర్పించినట్లు ప్రచారం జరుగుతోంది. రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకుండా మౌనం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటో అంతుబట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు



పట్టుబడిన నిందితులు, స్వాధీనం మోటార్లతో పోలీసులు

చిల్లకూరు, మార్చి 25: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ మోటార్లను చోరీ చేసే నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని కొత్తపాళెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రాము, మనోహర్ మద్యానికి బానిసలై, జల్సాలకు అలవాటుపడ్డారు. డబ్బుల కోసం పొలాల్లో వ్యవసాయ మోటార్లు, అల్యూమినియం వైర్లను చోరీ చేసి విక్రయించేవారు. ఈ క్రమంలో మండలంలోని పలు గ్రామాల్లో రూ.2,10,000 విలువ చేసే 14 విద్యుత్ మోటార్లు, రూ.9,600 విలువ చేసే కిలో అల్యూమినియం వైరును చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్‌ఐ అంజిరెడ్డి, నావూరయ్య, కస్తూరయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, విష్ణుకుమార్, భాస్కర్, నరేషను అభినందించారు. కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ అంజిరెడ్డి, విష్ణుకుమార్, భాస్కర్, రాజా, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి



సమావేశంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 25: రానున్న ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి జరుగుతుందని తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయానికి వచ్చిన ఆయనకు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నాయకులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వరప్రసాదరావు మాట్లాడుతూ 12 ఏళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో ఎంతో క్రమశిక్షణగా వ్యవహరించానని, ప్రత్యేకహోదా కోసం తన ఎంపీ పదవి కూడా రాజీనామ చేయడం జరిగిందన్నారు. కష్టకాలంలో పార్టీ కోసి పనిచేసిన తనకు సముచిత గౌరవం ఇవ్వకపోవడంతో పార్టీని వీడానన్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన తాను చివరి వరకు ప్రజల్లోనే ఉండాలనే ధ్యేయంతో బీజేపీలో చేరి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సిలికా అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని వరప్రసాదరావు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, ఆరికట్ల బాలకృష్ణం నాయుడు, చంద్రప్ప, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, రవీంద్రరెడ్డి, చాన్‌బాషా, దశరథరామిరెడ్డి, బైరప్ప, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళా సంక్షేమం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశిం సంధ్యారాణి

గూడూరు అర్బన్, మార్చి 25: చంద్రబాబునాయుడుతోనే మహిళా సంక్షేమం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక నాయుడుకాలువకట్ట ప్రాంతంలో శంఖారావం- సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించేలా చంద్రబాబునాయుడు మినీమేనిఫెస్టోను రూపొందించారన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు పెంచేయడంతో పేద ప్రజలు ఆర్థికంగా అవస్థలుపడుతున్నారన్నారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలంటే చంద్రన్నపాలన రావాలని, త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కడింపాటి వెంకటేశ్వర్లు, బాలసుబ్రహ్మణ్యం, అరుణ్‌కుమార్, నరసింహులు, రాజగోపాల్, శ్రీనివాసులు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీ విజల్‌తో కోడ్ ఉల్లంఘనలకు అడ్డుకట్ట

గూడూరు అర్బన్, మార్చి 25: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను అదుపు చేసేందుకు ఎన్నికల సంఘం సీ విజిల్ యాప్‌ను అదుబాటులోకి తీసుకువచ్చిందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే ఫొటోలు లేదా, వీడియోలు తీసి సీ విజిల్ యాప్‌లో పొందుపరిస్తే 100 నిమషాల్లో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం

సూళ్లూరుపేట, మార్చి 25: పౌర్ణమి సందర్భంగా చెంగాళమ్మ ఆలయంలో సోమవారం మహాచండీయాగాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండలపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేద పండితులు, మంత్రోచ్ఛరణల నడుమ యాగాన్ని నిర్వహించారు. అదేవిధంగా స్థానిక టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుని ఆలయంలో అభిషేకం చేసి విశేష పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

దాడికి పాల్పడిన వారిపై కేసులు

బాలాయపల్లి, మార్చి 25: మహిళపై దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహబూబ్ సుభాని తెలిపారు. మండలంలోని పిగిలాం గ్రామానికి చెందిన ఈతముక్కల రత్నమ్మపై అదే గ్రామానికి చెందిన జొన్నలగడ్డ పెంచలరామయ్య, నాగరాజు, రజిత, పూజ కత్తి, రాళ్లతో దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే అక్కసముద్రం గ్రామానికి చెందిన అశోక్, ప్రసాద్, మంజుల అదే గ్రామానికి చెందిన దాడి చేశారని బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులపై దాడి చేయడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఎస్పీ అభ్యర్థుల రెండవ జాబితా విడుదల

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ తరపున పోటీచేయనున్న 5 లోక్‌సభ, 50 శాసనసభ అభ్యర్థులతో రెండో జాబితాను ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్, మాజీ డీజీపీ డాక్టర్. జె.పూర్ణచంద్రరావు విడుదల చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతితో కలిసి సోమవారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. శాసనసభకు పోటీ చేసే 50మంది అభ్యర్థులను ఇదివరకే ప్రకటించామని, ఇప్పుడు మరో 50మందిని రెండో జాబితాలో ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఇందులో నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా భాస్కర గౌడ్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ టి.రమణయ్య, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మల్లికార్జునను ప్రకటించారు.

నేలబావిలో పడి ఇంటర్ విద్యార్థి మృతి

నాయుడుపేట టౌన్, మార్చి 25: నేలబావిలో పడి ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన నాయుడుపేట మండలంలోని కోనేటిరాజుపాళెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... హైదరాబాదులోని అమీర్‌పేటకు చెందిన ఈశ్వర్ కుమారుడు మోజస్(17) ఇటీవల ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాశాడు. సెలవులు కావడంతో వారం రోజుల క్రితం కోనేటిరాజుపాళెంలోని చిన్నాన్న ఇంటికి వచ్చాడు. సోమవారం స్నేహితులతో కలిసి బహిర్భూమి కోసం గ్రామ సమీపంలో ఉన్న నేలబావి వద్దకు వెళ్లాడు. మోజస్ నేలబావిలో దిగాడు. ఇంతలో బావిలో నుంచి శబ్ధం రావడంతో సమీపంలో ఉన్న స్నేహితులు వచ్చి చూసేసరికి మోజస్ నీట మునిగిపోతుండడం గమనించారు. వెంటనే గ్రామస్థులకు సమాచారం అందించారు. గ్రామస్తులు వచ్చేసరికి మోజస్ మృతి చెందాడు. మృతదేహాన్ని బయటకుతీసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మోజస్ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

వెంకటగిరిని నంబరు వన్‌గా అభివృద్ధి చేస్తా: లక్ష్మీసాయిప్రియ



ప్రజలతో కరచాలనం చేస్తున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి/డక్కిలి, మార్చి 25: వెంకటగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్‌వన్‌గా అభివృద్ధి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీ సాయిప్రియ చెప్పారు. సోమవారం ఆమె తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి పట్టణంలోని 1వ వార్డు బంగారుపేట నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తే ఐదేళ్ల కష్టపడి పనిచేస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అరాచక, విధ్వంసం పాలనకు ఇంకో యాభైరోజుల్లో ప్రజలు స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. లేదంటే ఆంధ్రప్రదేశ్‌లో సామాన్యులు బతకలేని పరిస్థితులు వస్తాయన్నారు. అంతకుముందు వార్డులోకి ప్రచారంకోసం విచ్చేసిన లక్ష్మీసాయిప్రియను టీడీపీ అభిమానులు పూలతో ముంచెత్తారు. అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల నివాసంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. త్వరలో జరిగే ఎన్నికలను యుద్ధంలా భావించి ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జన్ని రమణయ్య, చక్రాల ఉష, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాధనాయుడు, గంగాధర్, కాపా శ్రీనివాసులు నాయుడు, రావి మస్తాన్ నాయుడు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, కుర్రపాటి రామచంద్రయ్య, పోలంరెడ్డి వెంకటరెడ్డి, సీసీ నాయుడు, మంకు ఆనంద్, అవ్వారు సత్యం, పప్పు చంద్రమౌళి రెడ్డి, వల్లభనపేని మధునాయుడు, ముప్పాళ గురివేంద్ర నాయుడు, సత్యం, దండవోలు వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే దూషిస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ

నాయుడుపేట టౌన్, మార్చి 25: వైసీపీ నేతల అవినీతి, అక్రమాలను ప్రశ్నించేవారిని దూషించడం తగదని మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. వైసీపీలో కొనసాగిన రోజుల్లో పేద ప్రజలను ఆదుకోవాలని, వారికి సేవ చేయాలని పార్టీకి సలహాలు ఇస్తే తతను ఇబ్బందులకు గురిచేశారని, అందుకే టీడీపీలో చేరాల్సి వచ్చిందన్నారు. పెళ్లకూరు మండలంలోని ఓ వైసీపీ నేత తనపట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్నారని, ఇది మంచి పద్ధతికాదని అన్నారు. నాయకుడే మండలంలో ప్రకృతి సంపదను కొల్లకొడుతూ ప్రశ్నించిన వారిని దూషించడంతో పాటు దాడులకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో అతనిని ఎమ్మెల్యే సంజీవయ్య పార్టీకి దూరంగా పెట్టారని, ఎన్నికలు సమీపించడంతో దగ్గరకు చేర్చుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని రఫీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు నెలవల రాజేష్, కరీంబాయి, హరి, న్యాయవాది పసల చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీ విజయమే లక్ష్యంగా పనిచేయండి

సూళ్లూరుపేట, మార్చి 25: టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ విజయమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ ఏదైన చిన్నపాటి లోటుపాట్లు ఉన్నా నాయకులందరూ కలసి పనిచేసి విజయశ్రీని గెలిపించుకొని చంద్రబాబుకు కానుక ఇవ్వాలన్నారు. వేనాటి సతీష్ రెడ్డి మాట్లాడుతూ నాయకులందరూ కలిసి బూత్‌స్థాయిలో ఓటర్లను కలిసి ప్రభుత్వ అక్రమాలను వివరించి టీడీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు చెందిన నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, గాడి నారాయణ రెడ్డి, కొక్కు శంకరయ్య బాలయ్య, సుదర్శన్ రావు, కామిరెడ్డి మురళి రెడ్డి, బొమ్మన్ పళణి, శ్రీనివాసుల నాయుడు, మాధవనాయుడు, పూడి శెల్వం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం ముందు ధనబలం దిగదుడుపే: నెలవల



కొత్తూరువాసులతో నెలవల సుబ్రహ్మణ్యం, విజయశ్రీ తదితరులు

పెళ్లకూరు, మార్చి 25: ప్రజాబలం ముందు ధనబలం దిగతుడుపేనని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం పెళ్లకూరు మండలం కొత్తూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఐదేళ్ల పాటు కొండలు, గుట్టలు, నదులు, వాగులు, వంకలు, పొర్లుకట్టలను కరిగించి అక్రమ సంపాదనలో మునిగి తేలారని విమర్శించారు. ఎన్నికల కోడ్ వచ్చినా ఇప్పటికీ అక్రమ దందాలు సాగిస్తున్నారని, అధికార యంత్రాంగం అడ్డుకోకుండా వారికి దాసోహం అయిపోయిందరి ఆరోపించారు.. వీరి అక్రమాలను టీడీపీ ఇక చూస్తూ ఊరుకోబోదని ఎక్కడికక్కడ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి చర్యలు తీసుకోకపోతే, రానున్న కాలంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. రాష్ట్రంలో వైసీపీ రాక్షస, దోపిడీ, అరాచక పాలనకు చమరగీతం పాడేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. గతంలో జరిగిన పొరపాట్లకు తావులేకుండా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేయడంతో పాటు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కాగా, కొత్తూరులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రాభివృద్ధిన్ని దృష్టిలో పెట్టుకుని టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధునాయుడు, శివకుమార్, శేఖర్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, రాధానాయుడు, కేవీ నాయుడు, నేలవల్లి సిద్దులయ్యనాయుడు, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్. ఆరూరు రమణయ్య, చక్రపాణి, సత్యంరాజు, రామకృష్ణా, హరినాయుడు, సుధాకర్‌రెడ్డి, నరేంద్ర, యుగంధర్, యాగాని బెన్నీ, సురేష్‌నాయుడు, చలంనాయుడు, మునిరామయ్య, మల్లు కృష్ణయ్య, గురవయ్య, దామతోటి సుబ్రహ్మణ్యం, ఆరూరు సుబ్రహ్మణ్యం, గుంటపూడి రమణయ్య, పరుశురాం, చలపతి, చంద్ర, వెంకటేష్, ఏడుకొండలు, సురేష్, జడపల్లి వెంకటేశ్వర్లు, గోపాల్‌కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనను గద్దెదించాలి: టీడీపీ



టీడీపీలో చేరిన వారితో నరసింహయాదవ్, సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 25: రాష్ట్రంలో రాక్షస పాలనను గద్దెదించాల్సిన సమయం ఆసన్నమైందని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం చిల్లకూరు మండలం తిక్కవరం, నాంచారమ్మపేట, ముత్యాలపాడు, తొణుకుమాల తదితర గ్రామాల నుంచి పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరసింహ యాదవ్, సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించాలంటే చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని, త్వరలో జరిగే ఎన్నికల్లో అందరూ సైనికుల్లా పనిచేసి టీడీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, కిషోర్‌నాయుడు, సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, గుండాల లీలావతి, పజ్జాయి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, గుండాల శ్రీనివాసులు, అన్నం మునిశేఖర్‌గౌడ్, కీరవాణి, శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

కోలాహలంగా హోలీ సంబరాలు



సూళ్లూరుపేటలో రంగులు చల్లుకుంటున్న స్థానికులు

నాయుడుపేట, మార్చి 25: పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం హోలీ పండుగను కోలాహలంగా నిర్వహించారు. దర్గారోడ్డు, పాతబస్టాండ్, పిచ్చిరెడ్డితోపు, గాంధీమందిరం సెంటర్ల వద్ద స్థానికులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గడిపారు.

సూళ్లూరుపేట: పట్టణంలో హోలీ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. చిన్నారులు, యువతీ యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంతో సంబరాలు చేసుకొన్నారు.

కోట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం హోళి సంబరాలు జరిగాయి. కోట, విద్యానగర్, గూడలి, తిన్నెలపూడి, తిమ్మానాయుడుపాళెం తదితర గ్రామాల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

పండుగపూట మందుబాబుల క్యూ

తడ, మార్చి 25: పండుగపూట మందు బాబులు మద్యం కోసం ఎగబడ్డారు. తడలో నివాసం ఉంటున్న వివిధ రాష్ట్రాలకు చెందిన వారు సోమవారం హోలీ పండుగ జరుపుకున్నారు. ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా సంబరాలు చేసుకొన్నారు. అనంతరం మద్యం కోసం దుకాణాల ముందు క్యూకట్టారు. తడలో ఉన్న రెండు షాపుల వద్ద పెద్ద ఎత్తున మందుబాబులు చేరడంతో క్యూలైన్ రోడ్డు వరకు విస్తరించింది.



మద్యం కోసం దుకాణం ఎదుట క్యూకట్టిన మందుబాబులు

క్రైస్తవులకు అండగా టీడీపీ: పాశం

గూడూరు, మార్చి 25: క్రైస్తవులకు టీడీపీ అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, ఆ పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో క్రైస్తవులకు ప్రత్యేకంగా చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా నిధులు కేటాయించి వారి అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో సురేంద్రబాబు, ఇశ్రాయిల్‌కుమార్, రత్నశేఖర్, ప్రభుదాస్, డేవిడ్, విజయ్‌కుమార్, నాగరాజు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో తనిఖీలు



చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ అధికారులు

తడ, మార్చి 25: భీములవారిపాళెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్ఈబీ అసిస్టెంట్ కమీషనర్ మధుకర్‌రావు సోమవారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టులో అధికారుల పనితీరును పరిశీలించిన ఆయన ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట గూడూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమేష్, సీఐ రమేష్ ఉన్నారు.

కనుల పండువగా రథోత్సవం

సూళ్లూరుపేట, మార్చి 25: సూళ్లూరుపేట మండలం మంగళంపాడు గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. రథంలో కొలువు దీరిన స్వామివారిని భక్తుల కోలాహలం నడుమ గ్రామవీధుల్లో ఊరేగించారు.

ముత్యాలమ్మ ఆలయంలో చండీహోమం



చిల్లకూరు, మార్చి 25: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, చండీహోమం జరిపారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

కోట, మార్చి 25: కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురానికి చెందిన షేక్ జరీనా గర్భకోశవ్యాధితో బాధపడుతోంది. ఆమె వైద్య ఖర్చుల కోసం కోట పట్టణానికి చెందిన వెంకటగిరి సాహెబ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మోబిన్ బాషా రూ.5వేల అందజేశారు. అదేవిధంగా బీసీ కులాల ఐక్యవేదిక చైర్మన్ మర్లపల్లి గోపీకృష్ణ రూ.5వేలు అందజేశారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, మార్చి 25: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో సోమవారం మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, జీ.చంద్రశేఖర్, కరిముల్లా, ప్రభాకర్, రాము, కుమార్, వెంకటేశ్వర్లు, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.